నేటి కందం-నేటికి అందం

భారత క్రీడాకారులు
పారగులై స్పర్ధ లందు బహుమతుల గొనన్
హారతు లెత్తుచు మోడీ
తీరుగ శ్లాఘించె వారి తెగువరి తనమున్ !!

(భారత క్రీడాకారుల శక్తిని సామర్థ్యాన్ని భారత ప్రధాని మోడీ తన మన్ కీ బాత్ లో బహుధా ప్రశంసించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com



చురక

తెలంగాణ ప్రజల దిష్టి
తగిలి కొబ్బరెండిందట
కోనసీమ హరిత దనం
కాలిపోయి మాడిందట.
వేర్పాటుకు వ్యతిరేకత
వెల్లగక్కే సినీ నటుడు
కావాలని సభలు పెడితే
కాగలడా ఇష్ట భటుడు

-వేల్పుల నారాయణ
9440433475





హైదరాబాద్ బుధవారం 3-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:233 పేజీలు:6 వెల: రూ.1/-


# తెలంగాణ ప్రగతి ప్రశంసనీయం: రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, జూన్ 2:తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున ఖర్గే తదితరులు రాష్ట్ర ప్రజలకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం ధైర్యానికి, సంకల్పానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని ప్రధాని మోదీ కొనియాడారు. గొప్పచరిత్ర, వైభవోపేతమైన సంస్కృతి తెలంగాణ సొంతమని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, ఔత్సాహిక పారిశ్రామిక తత్వానికి రాష్ట్ర ప్రజలు పెట్టింది పేరు అని, వికసిత్ భారత్ కలను సాకారం చేసే క్రమంలో తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు విజయపథంలో పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రగతిపథం ప్రశంసనీయమని రాష్ట్రపతి ముర్ము కొనియాడారు. రాష్ట్రం సంపన్నమైన సాంస్కృతిక వారసత్వంతో, కష్టపడి పనిచేసే ప్రజలతో విలసిల్లుతోందని, కొన్నేళ్లుగా ఆవిష్కరణలు, అభివృద్ధి రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. తెలంగాణ ప్రజలు నిరంతర ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. విశిష్ట సంస్కృతి, అద్భుతమైన పారిశ్రామిక నైపుణ్యంతో దేశ గమనంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రం మరిన్ని ప్రగతి శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ రాజ్యం స్ఫూర్తితో తెలంగాణ ముందుకు సాగుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. 'తెలంగాణ అవతరణం చరిత్రాత్మకం. త్యాగాలు, పట్టుదల, లక్షలాది మంది ప్రజల అచంచలమైన ఆకాంక్షల నుంచి ఉద్భవించిన రాష్ట్రం. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీల నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ కలను సాకారం చేసింద'న్నారు.

నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన వారందరికీ పేరుపేరున నివాళులు అర్పిస్తున్నానని, వారి ధైర్యం, నిబద్ధత ఈ రాష్ట్ర ఆత్మలో ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమగ్ర వృద్ధి, అందరికీ సమాన అవకాశాలతో కూడిన నిజమైన 'ప్రజల తెలంగాణ' సాధనే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ధైర్యసాహసాలు, ఆవిష్కరణలు, పురోగతికి నిలయమైన తెలంగాణ నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు. తెలంగాణ మరింతగా వర్ధిల్లుతూ అందరికీ మరిన్ని అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జూన్ 5న తెలంగాణ సాంస్కృతిక ప్రదర్శనలు, వంటకాలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**-సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వ పాలన**
**- మంత్రి దామోదర రాజనర్సింహ.**
**-అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం.**
**-స్వయం సహాయక సంఘాలకు రూ.69.19 కోట్ల రుణాల పంపిణీ.**



సంగారెడ్డి, జూన్ 2( నేటి నిజం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లాలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను మంత్రి ఘనంగా సన్మానించి వారి త్యాగాలను స్మరించుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి, ఆయా శాఖల కార్యక్రమాలు, సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం నలుగురు దృష్టిలోపం కలిగిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. 768 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.69.19 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. అలాగే ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

పీఎం శ్రీ పాఠశాలల్లో నిర్వహించిన వేసవి శిబిరాలలో విశిష్ట సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అంతకుముందు ఐబీ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో జనసేన పోటీ చేస్తుంది: పవన్ కల్యాణ్



హైదరాబాద్, జూన్ 2:తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ అంతర్భాగమని స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు.

తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు పవన్ కల్యాణ్. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని ఏపీ డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.

పీక కోసినా..

ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించాను? అని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు.

ఇంకెంతకాలం..


తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు.

రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చురకలంటించారు.

# ప్రపంచంలోనే తెలంగాణను గేట్‌వేగా మార్చడం మా లక్ష్యం

## – రాష్ట్ర అవతరణ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 2:దేశంలోనే కాదు.. ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలనేది తన లక్ష్యమని, ఆ లక్ష్య సాధనకు తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్ రాచబాటలా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ఆర్థికవృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రైతులు, యువత, ఆడబిడ్డల ఆకాంక్షలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదల సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధన కోసం రెండున్నరేళ్లుగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు కేవలం పంటలు పండించటమే కాదు.. వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా వారిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని సీఎం తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్నల సాగు, పశుసంపద, మత్స్యరంగం గణనీయమైన అభివృద్ధి సాధించాయని.. భవిష్యత్తులో రైతులు రాష్ట్రాన్ని సకల పంటల క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు 2-3 రకాల పంటలసాగుకే పరిమితం కాకుండా నూనెగింజలు, పప్పుధాన్యాలు, కూరగాయలు పెద్ద ఎత్తున పండించాలని సూచించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగిస్తూనే, సౌరశక్తితో నడిచే పంపుసెట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని, అదనంగా ఉత్పత్తి అయ్యే కరెంటును గ్రిడ్‌కు అందించి రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చేస్తున్నామని చెప్పారు. రైతుభరోసా, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు రెండున్నరేళ్లలో రూ.1,56,496 కోట్లు, ధాన్యం కొనుగోళ్లకు రూ.82,840 కోట్లు ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ధాన్యం, మొక్కజొన్న, జొన్న తదితర పంటల కొనుగోళ్లలో దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణతో పోటీపడే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ నీటిగోస తీరలేదని, పదేళ్ల గత పాలనలో పరిస్థితులు మారలేదని, కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాలు తేల్చి అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేస్తామని సీఎం చెప్పారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు తిరిగి ప్రాణంపోస్తామని, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తామన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించే పనులు మొదలుపెడతామని ప్రకటించారు.

### ఆర్థికశక్తి కేంద్రాలుగా మహిళా సంఘాలు

ప్రజాపాలనలో మహిళా సంఘాలు ఆర్థిక శక్తికేంద్రాలుగా, ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్షేత్రాలుగా తయారయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, సౌర విద్యుత్ ప్లాంట్లు, పెట్రోలు బంకులతోపాటు వెయ్యి ఆర్టీసీ బస్సులకు ఓనర్లుగా మారారని, సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోడౌన్లు, రైస్‌మిల్లుల ఏర్పాటుకు మహిళలు సిద్ధమయ్యారని గుర్తు చేశారు. మరోవైపు, నిరుద్యోగులకు సీఎం శుభవార్త చెప్పారు. టీజీపీఎస్సీ ద్వారా ఇంజనీరింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, అటవీశాఖ, విద్యాశాఖల్లో ఖాళీల భర్తీకి ఈ నెలలో నోటిఫికేషన్ ఇస్తామని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో 1,190 మంది విద్యార్థులు కోర్సు పూర్తిచేశారని, వీరిలో 838 మంది మైక్రోసాఫ్ట్, ఫ్లిప్‌కార్ట్, టెక్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, ఏఐజీ- అపోలో హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు పొందినట్లు సీఎం గుర్తు చేశారు.

ఈ ఏడాది అన్ని ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని అమలుచేస్తామని తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

13 నెలల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, ఈ ఏడాది సెప్టెంబరు 17వ తేదీ నాటికి మరో 2 లక్షల ఇళ్లను పూర్తిచేస్తామని సీఎం ప్రకటించారు. ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, 19.44 లక్షల మంది కొత్త సభ్యులను చేర్చి... మొత్తంగా 3.38 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వృద్ధుల సామాజిక భద్రతకు భరోసా, గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం కొత్త చట్టాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 73 రకాల ఉపాధి రంగాల కార్మికులకు కనీస వేతనాలు నోటిఫై చేసినట్లు గుర్తు చేశారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయటానికి కమిటీ వేశామన్నారు. కులగణనను, 59 షెడ్యూల్డు కులాల గ్రూపుల విభజనను విజయవంతంగా పూర్తిచేసి, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని ఆమోదించినట్లు తెలిపారు. ఉద్యోగులకు ప్రత్యేక బీమాను తీసుకొచ్చామని, నగదు రహిత ఆరోగ్య పథకాన్ని త్వరలో అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్‌లో టిమ్స్ హాస్పిటళ్లు, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణం, 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### ముందే ముగిసిన సీఎం ప్రసంగం

సీఎం రేవంత్‌రెడ్డి పరేడ్ మైదానానికి ఉదయం 8.30 గంటలకు చేరుకొని జాతీయ జెండా ఆవిష్కరణ తర్వాత 9 గంటలకు ప్రసంగం ప్రారంభించారు.

అరగంటపాటు మాట్లాడిన తర్వాత.. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రసంగాన్ని ముగిస్తు న్నానని, పిల్లలు, పెద్దలు ఎవరూ ఇబ్బందులు పడకూడదని ప్రసంగ పాఠం మొత్తం చదవటంలేదని ప్రకటించారు. వేడుకల్లో పోలీసులు, కమెండోల పరేడ్‌లు, కళాకారుల ప్రదర్శనలు ప్రజలను అలరించాయి.

పరేడ్ మైదానానికి వెళ్లే ముందు గన్‌పార్కులోని అమరవీరుల స్తూపానికి సీఎం రేవంతరెడ్డి పుష్పాంజలి ఘటించారు.



### తెలంగాణ సంస్కృతికి పెద్దపీట

రాష్ట్రంలో మాదక ద్రవ్యాలకు కళ్లెం వేశామని, షీ-టీమ్స్, టీ-సేఫ్ సర్వీస్ ద్వారా మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని, మేడారం, యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర, కాళేశ్వరం ఆలయాల అభివృద్ధి పనులు శీఘ్రగతిన జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను రూ.వేయి కోట్లతో ఘనంగా నిర్వహిస్తామని, టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని గణనీయంగా ప్రోత్సహిస్తున్నామని, లైఫ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, రోడ్డు ట్యాక్స్‌లో మినహాయింపులు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. కబ్జాల్లో ఉన్న చెరువులు, కుంటలకు విముక్తి కలిగించామని, రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాల విస్తీర్ణాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలును ప్రాజెక్టును ఎల్‌అండ్‌టీ నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి అభివృద్ధి చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా మూసీ తీరంలో మసీదు, చర్చి, గురుద్వారా నిర్మిస్తామని వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఏర్పాటుచేస్తున్నామని, శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేయటం ద్వారా రీజినల్ కనెక్టివిటీ బలోపేతం అవుతుందన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని, వరంగల్‌లో 950 ఎకరాల స్థలాన్ని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని, 2030 నాటికి రాష్ట్రాన్ని టాప్ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలబెట్టాలనేది లక్ష్యమని, దీనిద్వారా రాబోయే రోజుల్లో 5 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

# తెలంగాణలో 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష..

హైదరాబాద్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది.

ఖైదీలు ఇవాళ జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు.

విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు.

వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి ఇవాళే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు.

# సులభంగా, చవకగా లభించే అమృతాహారం గుడ్డు

## (జూన్ 03న "జాతీయ గుడ్డు దినోత్సవం" సందర్భంగా)

పోషకాలు అధికంగా ఉండే చవకైన, సులభంగా అందుబాటులో ఉండే సామాన్యుడి ఆరోగ్యకరమైన ఆహారం గుడ్డు అని మనకు తెలుసు. భోజనంలో పోషక విలువను పెంచడానికి గుడ్లను కూరగాయలతో సులభంగా కలిపి వండుకుంటున్నాం. బేకరీల్లో తయారు చేసిన ఆహార పదార్థాల్లో గుడ్లు ఒక ముఖ్యమైన పోషక పదార్థం. గుడ్లు మన రోజువారీ ఆహారంలో ఒక భాగం. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనంలో గుడ్లను ఆస్వాదిస్తున్నాం. గుడ్ల యొక్క పోషక విలువ, బహుముఖ ప్రజ్ఞ, వంటల్లో రుచి, అధిక ప్రోటీన్ కంటెంట్‌ను గుర్తించి, సామాన్య ప్రజలకు తెలియజేయడానికి, ప్రతి సంవత్సరం జూన్ 3న "జాతీయ గుడ్డు దినోత్సవాన్ని (నేషనల్ ఎగ్ డే)"పాటిస్తున్నాం. గుడ్లు అనేక వంటకాలలో ప్రధాన పదార్థం మాత్రమే కాదు, కొత్త వంటల ప్రారంభాలకు కూడా చిహ్నంగా ఉన్నది.

### గుడ్లలో దాగిన పోషక విలువ :

గుడ్లు అనేక అమూల్యమైన పోషకాలతో నిండి ఉంటాయి, ఇవి చాలా తక్కువ కేలరీలతో పాటు అధిక-నాణ్యత కలిగిన ప్రోటీన్లతో పాటు అవసరమైన విటమిన్లను అందిస్తాయి. ఒక పెద్ద గుడ్డులో సుమారుగా 70 - 78 కేలరీలు, 6 గ్రాముల ప్రోటీన్, 5 గ్రాముల కొవ్వు (1.6 గ్రాముల సంతృప్త, 3.4 గ్రాముల అసంతృప్త) ఉంటాయి. అందువల్ల ఇది సమతుల్య ఆహారంలో ఒక అద్భుతమైన భాగంగా ఉంటుంది. గుడ్లలో సహజంగా విటమిన్లు ః12, ః6, ః5, ః2, ఆ, కోలిన్, ఫోలేట్, ల్యూటిన్, జీక్సాంథిన్ వంటి అనేక రకాల అవసరమైన ఆరోగ్యకర సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉంటాయి. గుడ్డులోని పచ్చసొనలో కొవ్వు, కొలెస్ట్రాల్, కొవ్వులో కరిగే విటమిన్లు (ం, ఆ, ఇ, ఐ), అందులో దాదాపు సగం ప్రోటీన్ ఉంటుంది. గుడ్డులోని తెల్లసొనలో కేవలం ప్రోటీన్ మాత్రమే ఉంటుంది. గుడ్డులోని సూక్ష్మపోషకాలలో సెలీనియం, ఫాస్ఫరస్, ఐరన్, జింక్, కాల్షియం, సోడియం, పొటాషియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. గుడ్డులోని చాలా పోషకాలు కేవలం పచ్చసొనలో మాత్రమే లభిస్తాయి. అయితే తెల్లసొనలో ప్రధానంగా ప్రోటీన్ ఉంటుంది. గుడ్లలో తొమ్మిది అవసరమైన అమైనో ఆమ్లాలు కూడా ఉన్నాయి. గుడ్ల ఆరోగ్య ప్రయోజనాలలో కంటి చూపుకు సహాయపడటం, రక్తంలో కొలెస్ట్రాల్‌ను పెంచకపోవడం, కణ త్వచాలను నిర్మించడం, అధిక స్థాయిలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లను అందించడం, ప్రోటీన్‌కు అద్భుతమైన మూలం కావడం, పక్షవాతం ప్రమాదాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.

రుచికరమైన గుడ్డు వంటకాలను తయారు చేయడం, అంతర్జాతీయ గుడ్డు వంటకాలను అన్వేషించడం, స్థానిక వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించడం, గుడ్డుకు సంబంధించిన సమావేశాలను నిర్వహించడం, గుడ్డుకు సంబంధించిన జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా జాతీయ గుడ్డు దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రోటీన్, విటమిన్లు మరియు ఖనిజాలకు గొప్ప మూలం ఎగ్స్. ఇవి అత్యంత ధనవంతుల నుండి నిరుపేదలు వరకు చాలా మందికి సరసమైన ధరలకు అందుబాటులో ఉండే ఆహార ఎంపిక. గుడ్డు వంటకాలలోని అంతులేని అవకాశాలను అన్వేషించండి. గుడ్డులోని ప్రోటీన్, పోషకాల నుండి అత్యధిక ప్రయోజనం పొందడానికి, గుడ్డును పచ్చసొన, తెల్లసొనతో సహా తిందాం. గుడ్లను అమృతాహారంగా తీసుకుందాం. ఆరోగ్యకరమైన జీవనానికి పునాదిగా గుడ్లను ఆహారంలో భాగం చేసుకుందాం.



-మధుపాలీ
9949700037

# మయన్మార్ అధ్యక్షుడి భారతదేశ అధికారిక పర్యటన సందర్భంగా భారత్-మయన్మార్ సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 2:భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు మయన్మార్ అధ్యక్షుడు యు మిన్ ఆంగ్ హలైన్. 2026 మే 30 నుంచి జూన్ 3 వరకు భారతదేశంలో తన మొదటి అధికారిక పర్యటనను చేపట్టారు.

అధ్యక్షుడితో పాటు మయన్మార్ అధ్యక్ష కార్యాలయం, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక - రెవెన్యూ, వ్యవసాయం, పశుసంవర్ధక - నీటిపారుదల, పరిశ్రమలు - ఎంఎస్‌ఎంఈ వ్యాపార అభివృద్ధి శాఖల కేంద్ర మంత్రులు.. మయన్మార్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. వీరితో వ్యవసాయం, ఔషధాలు, ఇంధనం, బ్యాంకింగ్, నిర్మాణం, ఐటీ, సమాచార ప్రసారాలు, వాణిజ్యం, లాజిస్టిక్స్ వంటి వివిధ రంగాలకు చెందిన వ్యాపార ప్రతినిధి బృందం కూడా ఉంది. మయన్మార్-భారత్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ సభ్యులు కూడా మయన్మార్ ప్రతినిధి బృందంలో భాగస్వాములుగా ఉన్నారు.

భారత ప్రధానమంత్రి, మయన్మార్ అధ్యక్షుడు 2026 జూన్ 1న చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి ఆసక్తి గల ద్వైపాక్షిక, ప్రాంతీయ-అంతర్జాతీయ అంశాలను సమీక్షించడంతో పాటు ఇరు దేశాల సంబంధాల భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. విచ్చేసిన విశిష్ట అతిథి గౌరవార్థం ప్రధానమంత్రి మధ్యాహ్న భోజన విందును ఏర్పాటు చేశారు. అదే రోజున మయన్మార్ అధ్యక్షుడికి భారత గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గౌరవపూర్వక స్వాగతం పలికారు. అంతకు ముందు విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు శ్రీ అజిత్ దోవల్ విడివిడిగా మయన్మార్ అధ్యక్షుడితో భేటీ అయ్యారు.

ఈ పర్యటన ప్రారంభంలో 2026 మే 30న అధ్యక్షుడు బోధ్‌గయను సందర్శించారు. అక్కడ ఆయన మహాబోధి ఆలయం, మహాబోధి ధ్యాన కేంద్రం, సుజాత ఆలయాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అత్యంత పవిత్రమైన ఈ పుణ్యక్షేత్రాల సందర్శన ఇరు దేశాల మధ్య ఉన్న శాశ్వత ఆధ్యాత్మిక- బౌద్ధ సంబంధాలు, ప్రజల మధ్య అనుబంధాలను మరింత స్పష్టం చేశాయి.

ఢిల్లీలో 2026 మే 31న యూఎంఎఫ్‌సీసీఐ, సీఐఐ సంయుక్తంగా నిర్వహించిన 'భారత్-మయన్మార్ బిజినెస్ కాన్‌క్లేవ్'లో అధ్యక్షుడు కీలకోపాన్యాసం చేశారు. ఈ సదస్సులో ఇరు దేశాల వ్యాపార ప్రముఖులు ద్వైపాక్షిక వాణిజ్యం, వాణిజ్య అవకాశాలను మరింత బలోపేతం చేయడం- విస్తరించడంపై చర్చించారు. స్వచ్ఛ ఇంధన ఆవిష్కరణలు, ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన అనుసంధానం, గ్రిడ్ దృఢత్వం వంటి రంగాల్లో జరుగుతున్న అధునాతన పరిశోధనలను పరిశీలించడానికి గ్రేటర్ నోయిడాలోని 'ఎన్‌టీపీసీ ఎనర్జీ టెక్నాలజీ రీసెర్చ్ అలయన్స్' (నేత్రా) కాంప్లెక్స్‌ను అధ్యక్షుడు సందర్శించారు.

అధ్యక్షుడితో జరిగిన చర్చల్లో ప్రధానమంత్రి మాట్లాడుతూ భారతదేశపు 'పొరుగు దేశాలకే మొదటి ప్రాధాన్యత, యాక్ట్ ఈస్ట్, మహాసాగర్ (ప్రాంతీయ భద్రత, సమగ్ర వృద్ధి) విధానాల సంగమ స్థానంలో మయన్మార్ ఉందని పేర్కొన్నారు. వాణిజ్యం-ఆర్థిక సంబంధాలు, రక్షణ- భద్రత, సరిహద్దు నిర్వహణ, అభివృద్ధి సహాయం- సాంస్కృతిక మార్పిడిలతో సహా ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయవలసిన ప్రాధాన్యతను ఈ చర్చలు స్పష్టం చేశాయి. వివిధ ద్వైపాక్షిక ఒప్పందాలు, అవగాహన పత్రాలపై ప్రస్తుతం జరుగుతున్న చర్చల ప్రస్తావించిన ఇరుపక్షాలు.. అవి త్వరలోనే విజయవంతంగా ముగియాలని ఆకాంక్షించారు.

మెరుగైన అనుసంధానత (రవాణా, సమాచార అనుసంధానం) ఇరు దేశాలకు ప్రయోజనకరమైన ఆర్థిక బంధాలను పెంపొందిస్తుందని, ఈ ప్రాంతంలో ఉమ్మడి శ్రేయస్సుకు దారితీస్తుందని ప్రధానమంత్రి ప్రముఖంగా చెప్పారు. ఈ నేపథ్యంలో 'కలదాన్ మల్టీ-మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్' ప్రాజెక్ట్, 'భారత్-మయన్మార్-థాయిలాండ్' త్రైపాక్షిక రహదారి పనులను పూర్తి చేయడానికి ఇరు దేశాలు కలిసి పనిచేయడం ఎంతో ముఖ్యమని ఇరుపక్షాల వారు అంగీకరించారు.

మయన్మార్ విద్యార్థుల కోసం మెకాంగ్ గంగా ఐసీసీఆర్ ఉపకార వేతనాల సంఖ్యను 2026 సంవత్సరం నుంచి 36 నుంచి 100 కి పెంచనున్నట్లు భారత ప్రధానమంత్రి తెలియజేశారు.

రూపాయి-క్యాట్ చెల్లింపుల విధానంతో సహా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి, పెంపొందించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయి. అలాగే 2024 మేలో ఈ విధానం ప్రారంభమైనప్పటి నుంచి నమోదైన లావాదేవీల స్థిరమైన వృద్ధి పట్ల ఇరు దేశాలు హర్షం వ్యక్తం చేశాయి. ఇరు దేశాల సంబంధిత జాతీయ చట్టాలు, నిబంధనలకు లోబడి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, పెట్రోలియం, ఇంధనం, మైనింగ్ వంటి ఉమ్మడి ఆసక్తి గల రంగాల్లో మరింత సన్నిహిత వాణిజ్య, పెట్టుబడి సహకారానికి ఇరుపక్షాలు తమ మద్దతును ప్రకటించాయి.

మయన్మార్ సార్వ భౌమాధికారానికి, ప్రాంతీయ సమగ్రతకు భారతదేశం అందిస్తున్న మద్దతును ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. పరస్పర భద్రతా ప్రయోజనాలకు భంగం కలిగించేలా తమ సార్వభౌమ భూభాగాన్ని దుర్వినియోగం చేయకుండా నిరోధించడంలోని ప్రాధాన్యతను ఇరువక్షాలు ప్రధానంగా చెప్పాయి. భారతదేశ భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకంగా తన భూభాగాన్ని ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని మయన్మార్ ఇస్తున్న హామీని అధ్యక్షుడు మరోసారి స్పష్టం చేశారు. మయన్మార్‌కు అత్యంత విశ్వసనీయ, నమ్మకమైన భాగస్వామిగా ఉన్న భారతదేశం ఇరు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని మరింత పటిష్ఠం చేయడానికి కట్టుబడి ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

మయన్మార్‌లో శాంతి, స్థిరత్వం, జాతీయ పునరుద్ధరణ, సామాజిక-ఆర్థిక అభివృద్ధి సాధన దిశగా మయన్మార్ నాయకత్వంలో జరుగుతున్న ప్రయత్నాలకు మద్దతునిస్తున్నట్లు ప్రధానమంత్రి తెలియజేశారు. ఇరు దేశాల మధ్య పరస్పర గౌరవం, స్నేహపూర్వక సంబంధాల ఆధారంగా నిరంతర సహాయ సహకారాలను అందించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. భారతదేశం అందిస్తున్న నిర్మాణాత్మక మద్దతు, సహకారాన్ని అధ్యక్షుడు అభినందించారు.

2026 జూన్ 02 - 03 తేదీలలో ముంబయిలో జరగనున్న పర్యటనలో భాగంగా మహారాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రితో అధ్యక్షుడి సమావేశాలుతో పాటు ఆయన పాల్గొననున్న వ్యాపార కార్యక్రమాలు ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న ద్వైపాక్షిక సహకారాన్ని, ఆర్థిక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

అధ్యక్షుడు యు మిన్ ఆంగ్ హలైన్ అధికారిక పర్యటన మయన్మార్, భారతదేశం మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహాన్ని, సన్నిహిత భాగస్వామ్యాన్ని పునరుద్ఘాటించింది. ఇరు దేశాల పరస్పర ప్రయోజనాల కోసం సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను ఇది చాటిచెప్పింది. అన్ని స్థాయిలలోనూ ఈ సన్నిహిత సంబంధాలను ఇలాగే కొనసాగించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

భారతదేశ పర్యటనలో తనకు, తన ప్రతినిధి బృంద సభ్యులకు లభించిన ఘన స్వాగత సత్కారాలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అధ్యక్షుడు యు మిన్ ఆంగ్ హలైన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పరస్పరం అనుకూలమైన తేదీల్లో మయన్మార్‌లో పర్యటించవలసిందిగా భారత ప్రధానమంత్రికి అధ్యక్షుడు ఆహ్వానం పలికారు.

# మయన్మార్ అధ్యక్షుడికి స్వాగతం పలికిన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 2:మయన్మార్ యూనియన్ రిపబ్లిక్ అధ్యక్షుడు శ్రీ యు మిన్ ఆంగ్ హలైన్‌కు రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము నేడు (జూన్ 1, 2026) ఘనస్వాగతం పలికారు.

రాష్ట్రపతి భవన్‌కు విచ్చేసిన అధ్యక్షుడు హలైన్ కు స్వాగతం పలుకుతూ.. భారత్, మయన్మార్‌ల మధ్య శతాబ్దాల నాటి లోతైన సాంస్కృతిక, నాగరికత, ఆధ్యాత్మిక బంధాలు ఉన్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. పరస్పర అవగాహన, స్నేహపూర్వకమైన బలమైన పునాదిపై మన సంబంధాలు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. భారత్‌తో భూసరిహద్దును పంచుకుంటున్న ఏకైక ఆసియా దేశం మయన్మార్ మాత్రమేనని.. అందుకే ఇది ఆగ్నేయాసియాకు భారతదేశపు ప్రవేశ ద్వారమని ఆమె అభివర్ణించారు. భారతదేశపు "నైబర్‌హుడ్ ఫస్ట్" (పొరుగుదేశాలకే తొలి ప్రాధాన్యం), "యాక్ట్ ఈస్ట్", "మహాసాగర్" విధానాల్లో మయన్మార్ అత్యంత కీలక భాగస్వామి అని చెప్పారు.

మయన్మార్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినందుకు అధ్యక్షుడు హలైన్‌కు రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. మన ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కొత్త ప్రభుత్వంతో కలిసి సన్నిహితంగా పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తోందని ఆమె అన్నారు.

మయన్మార్ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా వారి ప్రయత్నాలకు మద్దతిచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మయన్మార్‌లో శాంతి, సామరస్యాల స్థాపనకు భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

భారత్-మయన్మార్ భాగస్వామ్యంలో రవాణా అనుసంధానత ముఖ్యమైన అంశమని... మయన్మార్ ప్రభుత్వ మద్దతుతో ప్రస్తుతం కొనసాగుతున్న అనుసంధాన ప్రాజెక్టులు వీలైనంత త్వరగా పూర్తవుతాయని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఔషధాలు, యంత్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాల్లో భారత్-మయన్మార్ వాణిజ్య సంబంధాలు విస్తరించడం పట్ల రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. అయితే ద్వైపాక్షిక వాణిజ్యం ఇంకా పూర్తి సామర్థ్యానికి చేరుకోలేదని, దీనిని మరింత పెంపొందించడానికి మనం కలిసి పనిచేయాలని ఆమె తెలిపారు.

రాబోయే సంవత్సరాల్లో భారత్-మయన్మార్ మధ్య స్నేహబంధం మరింత బలోపేతం అవుతుందనే నమ్మకాన్ని ఇరు దేశాల నాయకులు వ్యక్తం చేశారు.

# భారత్-ఒమన్ సీఈపీఏ దాని ప్రయోజనాలను వివరిస్తున్న వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

అమరావతి, జూన్ 2:కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు.

ఈ వ్యాసం ప్రధానంగా భారత్-ఒమన్ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) భారతీయ ఎగుమతిదారు సంస్థలకు మార్కెట్లను విస్తరించుకొనే అవకాశాన్ని ఇవ్వడం, ఉద్యోగావకాశాల్ని పెంచడం, రైతుల ప్రయోజనాల్ని కాపాడడంతో పాటు, ఇరు దేశాల మధ్య సమృద్ధిని ఎలా పెంపొందింప చేస్తుందో వివరించింది. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషి దేశ పౌరుల జీవితాన్ని మెరుగుపరచడంలో తోడ్పడుతోందని కూడా ఈ వ్యాసం స్పష్టం చేస్తోంది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి కార్యాలయం ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

"భారత్-ఒమన్ సీఈపీఏ.. భారతీయ ఎగుమతిదారు సంస్థలకు మార్కెట్లను విస్తరించుకొనే అవకాశాన్ని ఇవ్వడం, ఉద్యోగావకాశాలను పెంచడం, రైతుల ప్రయోజనాలను కాపాడడంతో పాటు ఇరు దేశాల మధ్య సమృద్ధిని ఎలా పెంపొందింప చేస్తుందో ఈ వ్యాసంలో కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ వివరించారు.

అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దేశంలో ప్రతి ఒక్కరి జీవితాన్ని మెరుగుపరచడంలో తోడ్పడుతున్నాయని ఆయన స్పష్టం చేశారు" అని పేర్కొంది.

# 22వ ఆసియా అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ క్రీడల్లో 19 పతకాలు గెలిచిన భారత బృందానికి ప్రధాని అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 2:22వ ఆసియా అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ క్రీడల్లో అద్భుతంగా రాణించిన భారత బృందాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు.

ఛాంపియన్‌షిప్‌లో 10 స్వర్ణాలతో సహా 19 పతకాలు సాధించిన భారత బృందాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. భారతీయ యువ అథ్లెట్ల సంకల్పాన్నీ, ప్రతిభనీ ఈ విజయం ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులు తయారయ్యేందుకు ఈ విజయాలు భారతీయ యువతకు స్ఫూర్తినిస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు."22వ ఆసియా అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో 10 స్వర్ణాలతో సహా 19 పతకాలు గెలిచిన భారత బృందానికి అభినందనలు. భారతీయ యువ క్రీడాకారుల సంకల్పాన్నీ, ప్రతిభనీ ఈ అత్యుత్తమ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది. భవిష్యత్తులో మరింత మంది క్రీడలవైపు వచ్చేందుకు భారతీయ యువతకు ఈ విజయాలు స్ఫూర్తినిస్తాయని ఆశిస్తున్నాను."

# కొత్త బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే అంజిబాబు

## -బస్టాండ్ లోని స్టాల్స్, క్యాంటీన్, బాత్ రూమ్స్ లను పరిశీలిన
## -ప్రయాణికులతో స్త్రీ శక్తి పథకంపై అరా..



అమరావతి, జూన్ 2: భీమవరం కొత్త బస్టాండ్ ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ లోని స్టాల్స్, క్యాంటీన్, బాత్ రూమ్స్ లను పరిశీలించారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై ప్రయాణికులతో మాట్లాడి ఆరా తీశారు. బస్టాండ్ లోని క్యాంటీన్ ను పరిశుభ్రంగా ఉంచాలని, కూరగాయలను ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకుని నాణ్యమైన ఆహారాన్ని ప్రయాణికులకు అందించారన్నారు. స్టాల్స్ లో అధిక ధరలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భీమవరం బస్టాండ్ నుంచి ఎన్ని బస్సులు వెళున్నాయో ప్రతి రోజు సుమారు ప్రయాణికుల సంఖ్య వివరాలను ఆర్టీసీ అధికారులు గిరిధర్ కుమార్ ఎమ్మెల్యే కు వివరించారు.

ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ భీమవరం బస్టాండ్ పరిసరాలను అన్ని పరిశుభ్రంగా ఉన్నాయని, ఎప్పుడూ ఎక్కడ తనిఖీ చేస్తానో చెప్పకుండానే ప్రతి చోట విస్తృత తనిఖీలు చేస్తానన్నారు. స్త్రీ శక్తి పథకంతో మహిళలు బస్సు సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారని, త్వరలోనే సామాన్యులకు అందుబాటులో ఉండే విధానంగా భీమవరం నుంచి కొత్త ఏసీ బస్సులు రానున్నాయని అన్నారు. అన్ని పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, సతివాడ నవీన్, లంకి చిన్ని, మాగపు ప్రసాద్, పాలకోడేటి కార్తీక్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శవంతమైన గురువు గుణాలను చాటిచెప్పే సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 2:కొంత మంది ఏదైనా పనిని పూర్తి చేయడంలో చేయితిరిగిన వారై ఉంటారనీ, మరికొందరు ముఖ్యంగా నైపుణ్యాన్ని, లేదా జ్ఞానాన్ని ఇతరులకు బోధించడంలో ప్రవీణులై ఉంటారనీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఈ రెండు గుణాల్నీ .. అంటే తాను స్వయంగా సంపాదించిన విశేష ప్రజ్ఞతో పాటు, ఇతరులకు నేర్పించగల సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటే అప్పుడు అలాంటి వ్యక్తి సర్వశ్రేష్ఠ గురువుల్లో ఒకరుగా గౌరవాన్ని పొందవచ్చునని ప్రధానమంత్రి వివరించారు. యస్యోభయం సాధు స శిక్షకాణాం ధురి ప్రతిష్ఠాప యితవ్య ఏవ" అని సంస్కృత భాషలో ఉన్న ఓసుభాషితాన్ని ప్రజలతో ప్రధానమంత్రి పంచుకున్నారు.

కొందరు వ్యావహారంలో నిపుణలైతే, మరి కొందరు బోధనలో నిపుణులుగా ఉంటారు. అదే.. ఒక వ్యక్తి ఏదైనా విషయంలో ప్రావీణ్యం కలిగివుండడంతో పాటు ఆ ప్రావీణ్యాన్ని పరులకు ప్రభావవంతమైన పద్ధతిలో బోధించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నప్పుడు, అలాంటి వ్యక్తి.. గురువుల్లో అగ్రగణ్య స్థానా న్ని అందుకొనే అర్హతను పొందు తారని ఈ సుభాషితం సూచిస్తోంది.





ఆహ్వానము
ధర్మపురి కృష్ణమూర్తి సాంస్కృతిక సేవా సంస్థ
విశాఖపట్నం
గాన గంధర్వులు, పద్మవిభూషణ్
డా॥ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారి 80వ జయంతి వేడుక
సంగీతాభిమానులకు సహృదయపూర్వక ఆహ్వానం
వేడుక
తేది: 05-06-2026
శుక్రవారం సా॥ గం॥ 5.30 ని॥లకు
"ఆమనీ పాడవే హాయిగా"
బాలు పాట - త్యాగరాజునోట
వేదిక
విశాఖ పౌర గ్రంథాలయం,
హాల్ నెం.1, ఎ.సి. ద్వారకానగర్,
విశాఖపట్నం
సా॥6 గం॥ల నుండి 9.30 గం॥ల వరకు ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం గీతాలు
సా॥ 7 గం॥ల నుండి 7.30 గం॥ల వరకు
ప్రముఖ సినీ మరియు టి.వి. గీత రచయిత శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారికి బాలు పురస్కార ప్రదానం
ముఖ్య అతిథి : శ్రీ వి.వి. రమణ మూర్తి, లీడర్ పత్రికాధిపతి, రైటర్స్ అకాడమీ చైర్మన్
విశిష్ట అతిథులు : శ్రీ కడలి వీరాస్వామి, కన్వీనర్ మెలోడి క్రియేటర్స్, సీనియర్ సెక్షన్ సూపరింటెండెంట్,ఈ.కో.రైల్వే, మర్రిపాలెం రైల్వేకోలనీలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారి విగ్రహ స్థాపకులు
శ్రీ తాళాభక్తుల లక్ష్మీ ప్రసాద్, కవి, గేయరచయిత, స్వరకర్త, వ్యవస్థాపక అధ్యక్షులు, క్రియేటివ్ కామెడీ క్లబ్
ప్రత్యేక అతిథులు : డా॥ ఎస్.రహంతుల్లా, ఘంటసాల అవధాని, కళాపోషకులు.
శ్రీ అడపా రామకృష్ణ, కవి, కథా,నవలా రచయిత
గౌరవ అతిథులు : కళారత్న శ్రీ సుంకర చలపతి రావు, ఆర్ట్ క్రిటిక్, ప్రధాన కార్యదర్శి, చిత్రకళాపరిషత్
శ్రీ శిరేల సన్యాసిరావు, విశాఖ సంస్కృతి, ప్రధాన సంపాదకులు
ప్రియ అతిది : శ్రీ దేవరకొండ సహదేవరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, రచయిత, నటులు
సభా నిర్వహణ
శ్రీ మేడా మస్తాన్ రెడ్డి
రచయిత, వ్యాఖ్యాత,
వ్యవస్థాపక కార్యదర్శి, క్రియేటివ్ కామెడీ క్లబ్
అందరూ ఆహ్వానితులే
ఆహ్వానించువారు
ధర్మపురి త్యాగరాజు
విశ్రాంత అధికారి, హిందూస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లి.
ఫోన్: 8074 271 808

# సుస్థిర వ్యవసాయానికి సమతుల్య ఎరువుల వాడకం, భూసార కార్డులు, శాస్త్రీయ వ్యవసాయం కీలకం: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, జూన్ 2: మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా రామసియా గ్రామం నుంచి దేశవ్యాప్త 'ఖేత్ బచావో అభియాన్' (పొలాలను రక్షించే ఉద్యమం)ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాత్రి సింగ్ చౌహాన్ ప్రారంభించారు. నేలను కాపాడుకుంటేనే వ్యవసాయం వృద్ధి చెందుతుందని, రైతులు బలోపేతమవుతారని, దేశం సంపన్నంగా మారుతుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. సమతుల్య ఎరువుల వినియోగం, నేల పరీక్షలు, భూసార కార్డులు, ప్రకృతి వ్యవసాయం, జల సంరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.

జూన్ 1 నుంచి జూన్ 30 వరకు దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు సాగనున్న ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ.. భూమి మన తల్లిలాంటిదాని, దాని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మనందరి ఉమ్మడి బాధ్యత అని శ్రీ చౌహాన్ అన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులను విచక్షణారహితంగా వాడడం మానేసి, శాస్త్రీయ పరీక్షల ఆధారంగా నేల వాస్తవ అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఎరువులను వినియోగించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. రసాయనాలను మితిమీరి వాడడం వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా, నేలలో ఉండే ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు నశించిపోతాయని, ఇది నేరుగా వ్యవసాయ ఉత్పాదకతను దెబ్బతీసి సాగు ఖర్చులను పెంచుతుందని తెలిపారు.

భూమాతను రక్షించుకోవడానికి తీసుకున్న జాతీయ సంకల్పమే ఖేత్ బచావో అభియాన్ అని కేంద్ర మంత్రి అభివర్ణించారు. ఈ ప్రచారంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల నిపుణులు, కృషి విజ్ఞాన కేంద్రాల అధికారులు, వ్యవసాయ శాఖ బృందాలు, ప్రజాప్రతినిధులు దేశవ్యాప్తంగా ఉన్న గ్రామాలను సందర్శించి రైతుల్లో అవగాహన కల్పిస్తారని చెప్పారు. నేల పరీక్షలు, సమతుల్య పోషకాల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, ఆధునిక విత్తన పద్ధతులు, నీటి సంరక్షణ అధునాతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారని వివరించారు.

ప్రతి రైతుకు తప్పనిసరిగా భూసార కార్డు ఉండాలని, తద్వారా భూమికి కావాల్సిన వాస్తవ అవసరాల ఆధారంగానే ఎరువులు వేయవచ్చని ఆయన చెప్పారు. దీనివల్ల సాగు ఖర్చులు తగ్గి, ఉత్పాదకత పెరుగుతుందని, దీర్ఘకాలంలో భూసారాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుందని అన్నారు. రైతులకు రాయితీ ధరలకే ప్రభుత్వం ఎరువులను అందిస్తున్నప్పటికీ, దానిని ఆసరాగా చేసుకుని మితిమీరిన వినియోగాన్ని ప్రోత్సహించకూడదని శ్రీ చౌహాన్ స్పష్టం చేశారు. స్థిరమైన, సంప్రదాయ వ్యవసాయం ఎప్పుడూ ఎరువులను వివేకవంతంగా, సమతుల్యంగా వాడటంపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో సోయాబీన్, వరి, పప్పుధాన్యాల పంటల కోసం ప్రత్యేక క్షేత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెరుగైన విత్తనాల వినియోగం, శాస్త్రీయ విత్తన పద్ధతులు, లేజర్ లెవలర్లు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు, నీటిని పొదుపుగా వాడే సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, నిపుణులైన సంస్థల సహకారంతో రైతులకు క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని వివరించారు.

ఈ ప్రచార కార్యక్రమంతో మహిళా సాధికారతను కూడా కేంద్రమంత్రి అనుసంధానించారు. స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలకు ఉపాధి, ఆదాయ వనరులు, స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతామని ఆయన పేర్కొన్నారు. అర్హులైన మహిళలకు శిక్షణ, ఆర్థిక సహాయం, చిన్న తరహా పరిశ్రమలు ప్రారంభించే అవకాశాలు కల్పిస్తామని... తద్వారా వారు స్వయం సమృద్ధి సాధించి, కుటుంబ ఆదాయాలను పెంచడంలో తోడ్పడగలరని ఆయన తెలిపారు.

యువత గురించి శ్రీ చౌహాన్ మాట్లాడుతూ.. వారి కొరకు సరైన మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి, సన్నద్ధత కోసం మరిన్ని గొప్ప అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. గ్రామీణాభివృద్ధి అంటే కేవలం రోడ్లు, గృహనిర్మాణం, ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన మాత్రమే కాదని.. గ్రామాల్లో ఉపాధి, ఆదాయం, స్వయం సమృద్ధిని పెంపొందించడం కూడా అందులో భాగమేనని పేర్కొన్నారు.

రామసియా గ్రామం నుంచి ప్రారంభమైన ఈ ప్రచార కార్యక్రమం.. తరువాతి కాలంలో ప్రజల భాగస్వామ్యంతో నడిచే ఒక పెద్ద ప్రజా ఉద్యమంగా మారుతుందని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు. అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించాలని, రైతులకు సాంకేతిక సహాయం అందించాలని, వ్యవసాయాన్ని రక్షించాలనే సంకల్పాన్ని క్షేత్రస్థాయిలో ఆచరణలోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం, సమాజం సంయుక్తంగా కృషి చేస్తేనే సంపన్న గ్రామాలు, రైతు సాధికారత, మహిళల స్వయం సమృద్ధి, ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతాయని పేర్కొంటూ.. అభివృద్ధి కార్యక్రమాల్లో రైతులు, మహిళలు, యువత చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టి గల నాయకుడని, ఆయన భవిష్యత్తు తరాల కోసం ప్రణాళికలు రచిస్తారని కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ చౌహాన్ అన్నారు. భూమాత కేవలం ప్రస్తుత తరానికి మాత్రమే కాకుండా రాబోయే తరాలకు కూడా చెందుతుందని వ్యాఖ్యానించారు. అందుకే భవిష్యత్తు తరాలకు ఆహారాన్ని అందించలేని స్థాయికి భూమి పరిస్థితి ఎన్నడూ క్షీణించిపోకూడదని అన్నారు. నేల ఆరోగ్యంగా, సారవంతంగా ఉండేలా చూసేందుకు, భూమి వాస్తవ పోషక అవసరాల ఆధారంగా సమతుల్య ఎరువులను ఉపయోగించేలా రైతులను ప్రోత్సహిస్తామని చెప్పారు.

నకిలీ ఎరువులు, పురుగు మందులపై అవగాహన కల్పించడంపై కూడా ఈ ప్రచారంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని కేంద్రమంత్రి ప్రకటించారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అత్యంత అనువైన పంటల ఎంపిక, విత్తన రకాలు, సరైన వ్యవసాయ పద్ధతులు, విత్తన శుద్ధి విధానాలు ఇతర శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు మార్గదర్శకత్వం వహిస్తామని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై కూడా ప్రచారం చేస్తామన్నారు. ఈ ప్రచారం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల ప్రయోజనాలను చేరవేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల నిపుణులు, ప్రజాప్రతినిధులు, పరిపాలనా అధికారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు పోషకాహార కిట్లను కూడా పంపిణీ చేశారు.

# ఏషియన్ గేమ్స్ 2026 కన్నా ముందు టీఓపీఎస్ డెవలప్‌మెంట్ గ్రూపులో 22 మంది రోయర్లకు స్థానం

న్యూఢిల్లీ, జూన్ 2:ఐచీ-నాగోయాలో నిర్వహించనున్న ఏషియన్ గేమ్స్-2026 తో పాటు త్వరలో మరిన్ని ఇతర ఈవెంట్లు చోటుచేసుకోనున్నాయి. అంతకన్నా ముందు జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్ (ఎమ్ఓసీ) 174వ సమావేశంలో, అనేక మంది రోయర్ల (తెడ్లతో పడవ నడిపే వారిని) టార్గెట్ ఒలింపిక్ పోడియమ్ స్కీమ్ (టీఓపీఎస్) డెవలప్‌మెంట్ గ్రూపులో చేర్చారు. భారత రోయింగ్ సమాఖ్య (ఆర్ఎఫ్ఐ) వార్షిక జాతీయ ఎంపిక పరిశీలనలు ముగించి, 'క్రూ' కు తుది రూపునిచ్చిన మీదట ఈ జాబితాను రూపొందించారు.

ప్రస్తుతం ఆరు పడవలకు సంబంధించి మొత్తం 22 మంది రోయర్లను టాప్స్ డెవలప్‌మెంట్ గ్రూపునకు ఎంపిక చేశారు. వీరు రోయింగ్ ఒక క్రీడాంశంగా ఉండే ఏషియన్ గేమ్స్, వరల్డ్ కప్ సర్క్యూట్ సహా ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి సిద్ధమవుతారు. తాజాగా చేర్చుకున్న ప్రముఖ క్రీడాకారుల్లో 2024లో ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శ్రీ బల్‌రాజ్ పన్‌వర్, ఏషియన్ గేమ్స్-2022లో రజత పతక విజేత శ్రీ అరవింద్ సింగ్, ఏషియన్ గేమ్స్-2022లో డబల్ పతక విజేత శ్రీ జస్‌వీందర్ సింగ్ సహా మరికొందరు ఉన్నారు.

ఈ 22 రోయర్లను వివిధ పడవల విభాగాల్లో సర్దుబాటు చేశారు. ఈ విభాగాల్లో పురుషుల సింగిల్ స్కల్స్ (ఎమ్1ఎక్స్), పురుషుల డబల్ స్కల్స్ (ఎమ్2ఎక్స్), పురుషుల క్వాడ్రుపల్ స్కల్స్ (ఎమ్4ఎక్స్), లైట్‌వెయిట్ మెన్స్ డబల్ స్కల్స్ (ఎల్ఎమ్2ఎక్స్), పురుషుల కాక్స్‌డ్ ఎయిట్ (ఎమ్4-)తో పాటు మహిళల కాక్స్‌లెస్ ఫోర్స్ (డబ్ల్యూ4-) భాగంగా ఉన్నాయి. క్రీడాకారుల్లో చాలా మందిని ఏషియన్ గేమ్స్-2026ను దృష్టిలో పెట్టుకొని సన్నద్ధం చేస్తున్నారు. కామన్‌వెల్త్ గేమ్స్-2030 వంటి భావి పోటీలు లక్ష్యంగా పెట్టుకొని కొంత మంది క్రీడాకారుల బృందాలకు తగిన శిక్షణను అందిస్తున్నారు.

భారతీయ రోయర్లుగా ఇంత మందిని టీఓపీఎస్ డెవలప్‌మెంట్ గ్రూపులోకి చేర్చుకోవడం.. వ్యక్తిగత పతకం విభాగంలో గల అవకాశాలపైన దృష్టి పెట్టడం కన్నా అనేక బోట్ కేటగిరీల్లో పోటీ పడగలిగే క్రీడాకారులుగా చాలినంత మందిని తీర్చిదిద్దే దిశగా చేసిన మరో ప్రయత్నమని చెప్పాలి. భారత్ 2030వ సంవత్సరంలో కామన్‌వెల్త్ గేమ్స్ (సీడబ్ల్యూజీ) వందో సంచికను నిర్వహించడానికి సన్నద్ధమవుతున్న క్రమంలో, రోయింగ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, సంబంధిత క్రీడాకారులను చెప్పుకోదగిన సంఖ్యలో తయారు చేసుకోవడం చాలా కీలకం. కామన్‌వెల్త్ గేమ్స్1986 సంచికను ఎడిన్‌బర్గ్‌లో నిర్వహించారు. అప్పటి నుంచి రోయింగ్ క్రీడ కామన్‌వెల్త్ గేమ్స్‌లో భాగంగా లేదు. అయితే ఈ ఆటల వందో సంచికలో దీనిని తిరిగి తీసుకు వచ్చే సూచనలు ఉన్నాయి.

# గంజాయి నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీసుల ప్రత్యేక కార్యాచరణ

### -జిల్లా వ్యాప్తంగా మెగా గంజాయి టెస్టింగ్ కార్యక్రమాలు
### -గంజాయి వినియోగదారులకు కౌన్సిలింగ్ ద్వారా మార్పు
### -'డ్రగ్స్ ఫ్రీ తిరుపతి జిల్లా' లక్ష్యంగా నిరంతర చర్యలు




తిరుపతి, జూన్ 2: గంజాయి ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీసు శాఖ విస్తృత స్థాయిలో చర్యలు చేపడుతోంది. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటంతో పాటు సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

"డ్రగ్స్ ఫ్రీ తిరుపతి జిల్లా" లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు, కౌన్సిలింగ్ కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని ప్రతి సబ్ డివిజన్‌లో సంబంధిత డీఎస్పీల ఆధ్వర్యంలో "మెగా గంజాయి టెస్టింగ్" కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అనుమానిత ప్రాంతాలు, పరిశ్రమలు, కార్మికుల సమూహాలు, ఇతర గుర్తించిన ప్రాంతాల్లో గంజాయి పరీక్షలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

గంజాయి పరీక్షల్లో పాజిటివ్‌గా గుర్తించిన వ్యక్తులపై కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వారిని మత్తు అలవాట్ల నుంచి దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ పర్యవేక్షణలో తొట్టంబేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కజారియా ఫ్యాక్టరీ, వి-ఫార్మ్ పరిశ్రమల కార్మికులకు మెగా గంజాయి టెస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సమక్షంలో కార్మికులకు పరీక్షలు నిర్వహించి మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత, విద్యాసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. "మత్తుకు దూరంగా ఉండండి ? భవిష్యత్తును కాపాడుకోండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజ శాంతిభద్రతలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 (ఈగల్) టోల్ ఫ్రీ నంబర్ లేదా 112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు.

# డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐబీడీ), పారిశ్రామిక - అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) మధ్య అవగాహన ఒప్పందం



న్యూఢిల్లీ, జూన్ 2:'భాషిణి సేవ/సంచలన్ - భాషిణి సహయోగి కార్యక్రమం' కింద.. ఎలక్ట్రానిక్స్ - సమాచార సాంకేతిక శాఖ కింది డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ) పరిధిలోని డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐబీడీ), వాణిజ్య - పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పారిశ్రామిక - అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. భాషిణి వేదిక ద్వారా భారత పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య వ్యవస్థలో బహుభాషా డిజిటల్ సామర్థ్యాలను, జాతీయ భాషాపరమైన డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ఈ ఒప్పందం లక్ష్యం.

వివిధ భాషల్లో సమాచారాన్ని అందుబాటులోకి తేవడం, వివిధ భాషల్లో నిర్వహణ, రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలు కింద గుర్తించిన 22 భాషల్లోనూ డీపీఐఐటీ డిజిటల్ వేదికల్లో సేవలను అందించడం ఈ భాగస్వామ్య ముఖ్య లక్ష్యం. దీనివల్ల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు, పెట్టుబడిదారులు, వ్యాపార సంస్థలు, ప్రజలు తమ భాషల్లోనే సమాచారాన్ని, ప్రభుత్వ సేవలను సులభంగా పొందే అవకాశం లభిస్తుంది.

ఈ భాగస్వామ్యంలో భాగంగా.. డీపీఐఐటీ వేదికల్లో వివిధ భాషా సేవలను అందించడం కోసం డీపీఐఐటీ, భాషిణి బృందం కలిసి పనిచేస్తాయి. అనువాద ఏపీఐలు, రంగాల వారీగా భాషా నమూనాల అభివృద్ధి, బహుభాషా పదకోశాలను సృష్టించడం, శబ్దపరమైన సాంకేతికతలు, భాషాపరమైన డేటాతోపాటు.. భాషిణి ఉద్యత్, మిత్ర, యాప్ మిత్ర, ప్రవక్త వంటి ప్రత్యేక సాంకేతికతలు, కార్యక్రమాల ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేస్తారు.

ప్రభుత్వ సమాచార లభ్యత, అంకుర సంస్థలు - పారిశ్రామిక సేవలు, విధానపరమైన సమాచారం, ప్రజా భాగస్వామ్యాల్లో భాషాపరమైన అడ్డంకులను తొలగించడం ద్వారా.. మరింత సమ్మిళితమైన పెట్టుబడి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

దేశంలోని వైవిధ్య భరితమైన భాషా వాతావరణానికి అనుగుణంగా శబ్దపరమైన బహుభాషా సేవలను అందించే చేసే దిశగా.. పెట్టుబడులకు ప్రోత్సాహం, పారిశ్రామిక అభివృద్ధి, ఆవిష్కరణలు, వ్యవస్థాపక సంబంధ రంగాలకు సరిపోయే బహుభాషా ఏఐ నమూనాలను, భాషా సాంకేతికతలను బలోపేతం చేయడంపై కూడా ఈ భాగస్వామ్యం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

భారతీయ అంకుర సంస్థలు, తయారీ రంగం, ఆవిష్కరణ వ్యవస్థల్లో అవకాశాల లభ్యతను విస్తరించడంలో బహుభాషా సాంకేతికతల ప్రాధాన్యం పెరుగుతోందని ఈ చర్చలు స్పష్టం చేశాయి. ఆర్థిక వృద్ధిలో భాగస్వామ్యానికి భాష అవరోధం కాకూడదన్న భరోసానిచ్చే దిశగా చర్చలు సాగాయి.

డీపీఐఐటీ అనుబంధ సంస్థలు, భాగస్వామ్య పక్షాల పరిధిలో భాషాపరమైన సమాచార సేకరణ, అవగాహన కార్యక్రమాలు, సామర్థ్యాభివృద్ధి చర్యలతోపాటు.. బహుభాషా ఏఐ సాధనాల విస్తృత వినియోగాన్ని ఈ అవగాహన ఒప్పందం ప్రోత్సహిస్తుంది.

ఈ సహకారంలో భాగంగా.. బహుభాషా డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతం, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, పెట్టుబడి వ్యవస్థలో సేవల లభ్యతను విస్తరించడం వంటి లక్ష్యాలతో కూడిన నిర్దిష్ట కార్యక్రమాలను డీపీఐఐటీ, డీఐబీడీ సంయుక్తంగా చేపట్టి, సహకారాన్ని అందించవచ్చు.

సమ్మిళిత, అందుబాటులో ఉన్న, ఏఐ ఆధారిత డిజిటల్ పాలన దిశగా.. దేశ జనాభా విస్తృతికి తగిన భాషా మౌలిక సదుపాయంగా భాషిణి పాత్రను ఈ భాగస్వామ్యం స్పష్టం చేస్తోంది. అదే సమయంలో ఆర్థిక వికాసంలో విస్తృత భాగస్వామ్యం, వ్యవస్థాపకత, పెట్టుబడులకు ప్రోత్సాహంలో దేశ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తోంది.

డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐబీడీ) గురించి:

డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐబీడీ).. ఎలక్ట్రానిక్స్ - సమాచార సాంకేతిక శాఖ కింది డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ) పరిధిలోకి వస్తుంది. ఏఐ ఆధారిత బహుభాషా డిజిటల్ సమ్మిళితత్వం, భాషా సాంకేతికతల్లో భారత్ చేపట్టిన జాతీయ స్థాయి కార్యక్రమమిది. జాతీయ భాషా సాంకేతికతా కేంద్రం (ఎన్‌హెచ్‌ఎల్‌టీ) ద్వారా.. పాలన, ప్రభుత్వ వేదికలు, సంస్థల కోసం అన్ని భారతీయ భాషల్లో విస్తృతమైన వాచక, సందేశ ఆధారిత ఏఐ సేవలకు భాషిణి అవకాశం కల్పిస్తుంది. ఈ వేదిక ప్రస్తుతం 800కు పైగా ప్రభుత్వ వెబ్‌సైట్లకు సేవలందిస్తూ, రోజూ 15 మిలియన్లకు పైగా సందేహాలను పరిష్కరిస్తోంది. అలాగే 36 భారతీయ లిఖిత భాషలు, 23 భారతీయ మౌఖిక భాషలు, 35 అంతర్జాతీయ భాషల్లో సహకారాన్ని అందిస్తోంది. ఓపెన్ సోర్స్ ఆవిష్కరణలు, బహుభాషా ఏఐ పరిశోధనలు, సమాచార కోశాల అభివృద్ధి, అంకుర సంస్థలకు ప్రోత్సాహం, విద్యాసంస్థలతో భాగస్వామ్యాలను కూడా డీఐబీడీ ముందుకు తీసుకెళ్తోంది. తద్వారా దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోంది.

# 10 వేల ఎకరాల్లో పట్టు సాగుకు భారీ ప్రణాళిక..

### -10 వేల ఎకరాల్లో పట్టు సాగుకు భారీ ప్రణాళిక..
### -రైతుల ఆదాయ పెంపుపై కలెక్టర్ ఫోకస్!

అమరావతి, జూన్ 2:జిల్లాలో పట్టుపరిశ్రమ (సెరికల్చర్) అభివృద్ధి, పట్టు రైతుల ఆదాయ పెంపు లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సెరికల్చర్ శాఖ జాయింట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.

2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో కొత్తగా 10 వేల ఎకరాల్లో మల్బరీ సాగు విస్తరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ లక్ష్యాలను గ్రామస్థాయి సిబ్బందికి కేటాయించి విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. ఇందులో 4 వేల ఎకరాలను ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. సాగు విస్తీర్ణమంతా తప్పనిసరిగా ఈ-పంట పోర్టల్‌లో నమోదు కావాలని స్పష్టం చేశారు.

పెనుకొండ డివిజన్‌లో పట్టుసాగు విస్తరణ దృష్ట్యా అదనపు సిబ్బందిని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఎకరాకు 900 కిలోల పట్టుగూళ్ల దిగుబడి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని, వాస్తవ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సవరించిన లక్ష్యాలను సమర్పించాలని సూచించారు.

అలాగే హిందూపూర్‌లో నిర్మాణంలో ఉన్న నూతన పట్టుగూళ్ల మార్కెట్ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

### సహజ వ్యవసాయానికి ప్రాధాన్యం

జిల్లాలో పట్టు రైతుల్లో కనీసం 20 శాతం మందిని సహజ వ్యవసాయం వైపు మళ్లించేలా గ్రామస్థాయి సెరికల్చర్ అసిస్టెంట్లకు ప్రత్యేక లక్ష్యాలు నిర్దేశించాలని కలెక్టర్ పేర్కొన్నారు. నేల సారాన్ని పెంపొందించేందుకు 'ప్రాజెక్ట్ పునరుజ్జీవం' కింద బయోచార్ కో-కంపోస్టింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

### నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి

పట్టు తోటల్లో నీటి వినియోగం అధికంగా ఉండటంతో 'జలధార-జలాహారతి' కార్యక్రమం ద్వారా నీటి బడ్జెటింగ్ అమలు చేయాలని, డ్రిప్ ఇరిగేషన్, ఫామ్‌పాండ్‌లు, సరిహద్దు కందకాల తవ్వకంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రగతిని సమర్థంగా అంచనా వేసేందుకు రైతుల మోటార్ల విద్యుత్ సర్వీస్ నంబర్లను సేకరించాలని సూచించారు.

### ఎఫ్‌పీఓల ఏర్పాటుకు ప్రోత్సాహం

పట్టు రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు) ఏర్పాటు చేయాలని, ఇందుకోసం నాబార్డ్ రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. సమగ్ర పట్టుగూళ్ల ఉత్పత్తి విధానాలపై ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) సిద్ధం చేయాలని, తక్కువ ఖర్చుతో కూడిన పట్టు పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయి అధికారుల టూర్ డైరీలను క్రమం తప్పకుండా సమర్పించాలని, అర్హులైన రైతుల గుర్తింపును సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు.

రైతుతో నేరుగా మాట్లాడిన కలెక్టర్

సమీక్షా సమావేశం మధ్యలో మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ మండలం కరికెర గ్రామానికి చెందిన పట్టు రైతు డి. జంపన్నతో కలెక్టర్ నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఐదు ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్న ఆయన కొత్తగా పట్టు పురుగుల పెంపకం షెడ్ నిర్మించుకోవాలనే ఆసక్తిని వ్యక్తం చేయగా, అవసరమైన సాంకేతిక సలహాలు, ప్రభుత్వ సహాయం అందించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎన్. శోభారాణి, హెచ్. హనుమంతరాయు, డి. వెంకటస్వామి నాయక్, జె. హంపయ్యతో పాటు సెరికల్చర్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# తుగ్గలిలో కరెంటోళ్ల జనబాట కార్యక్రమం

అమరావతి, జూన్ 2: మండల కేంద్రమైన తుగ్గలిలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పత్తికొండ ట్రాన్స్‌కో ఏడీఈ మదన్ మోహన్, అసిస్టెంట్ ఇంజనీర్ సుజాత విద్యుత్ సేవలు, వినియోగదారుల సమస్యల పరిష్కారం, విద్యుత్ భద్రతా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను ముందుగా స్థానిక విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని, అక్కడ పరిష్కారం కాకపోతే సంబంధిత ఉన్నతాధికారులకు నేరుగా తెలియజేయాలని వినియోగదారులకు సూచించారు.

# శ్రీ జయంత్ చౌదరి, డాక్టర్ సుకాంత మజుందార్, శ్రీమతి శోభనా కామినేని, శ్రీ సంజీవ్ బజాజ్ సహ అధ్యక్షులుగా భవిష్యత్తు నైపుణ్యాలపై ఉన్నత స్థాయి చర్చ



న్యూఢిల్లీ, జూన్ 2:వరల్డ్ ఎకనామిక్ ఫోరం సహకారంతో నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ నేడు న్యూఢిల్లీలో 'ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్' ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. "అవగాహన నుంచి ఆచరణ వైపు: అభివృద్ధి కోసం నైపుణ్యాల కొరతను అధిగమించడం'' ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నైపుణ్యాల కొరతను భర్తీ చేయడానికి, ప్రపంచ నైపుణ్యాల కేంద్రంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన ప్రాధాన్యతా చర్యలపై చర్చించడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, అంతర్జాతీయ సంస్థలు, అభివృద్ధి భాగస్వాములను ఈ సమావేశం ఒకచోట చేర్చింది.

కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత జనవరి 2026లో ప్రకటించిన ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్ కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఇది వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ గ్లోబల్ యాక్సిలరేటర్స్ నెట్‌వర్క్‌లో ఒక భాగం. మారుతున్న కార్మిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య వ్యవస్థలను మెరుగుపరచడం, నైపుణ్యాల అభివృద్ధికి కొత్త ఆర్థిక సహాయ పద్ధతులను రూపొందించడం, కృత్రిమ మేధ, ఆధునాతన తయారీ, సరఫరా వ్యవస్థలు, హరిత ఆర్థిక వ్యవస్థ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను సిద్ధం చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు సహకారాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

ఈ ఉన్నత స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశానికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), విద్యాశాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి, కేంద్ర విద్యాశాఖ, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్, అపోలో ఆసుపత్రుల కార్యనిర్వాహక అధ్యక్షురాలు శ్రీమతి శోభనా కామినేని, బజాజ్ ఫిన్‌సర్వ్ ఛైర్మన్, ఎంపీ శ్రీ సంజీవ్ బజాజ్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. వీరితోపాటు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మిరెక్ దుసెక్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు.

దేశ శ్రామిక మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్న కీలక అంశాలను గుర్తించడం, నైపుణ్యాల కొరతను తీర్చడానికి అవసరమైన ప్రాధాన్యతా చర్యలను ఖరారు చేయడం, ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి కట్టుబడి ఉండే భాగస్వాముల కూటమిని బలోపేతం చేయడం వంటి విషయాలపై ప్రధానంగా చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), విద్యాశాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి మాట్లాడుతూ.. "సాంకేతికత, పరిశ్రమలు, మారుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను నిరంతరం అనుసంధానించగలిగితే.. దేశ జనాభా శక్తి ప్రపంచంలోనే అతిపెద్ద వృద్ధి కారకంగా మారుతుంది. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, అంతర్జాతీయ సంస్థలు కేవలం సవాళ్లపై చర్చించడానికే కాకుండా, పరిష్కారాలను కలిసి రూపొందించడానికి ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్ ఒక కొత్త సహకార నమూనాను అందిస్తుంది. దేశం వికసిత్ భారత్ 2047 వైపు పురోగమిస్తున్న తరుణంలో దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ ఆవిష్కరణలు, వృద్ధిని ముందు? తీసుకెళ్లగలిగే చురుకైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడగల నైపుణ్యాలను పెంపొందించడంపై మనం దృష్టి సారించాలి".

సమావేశాన్ని ఉద్దేశించి కేంద్ర విద్యాశాఖ ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ మాట్లాడుతూ.." నేర్చుకోవడం, ఉపాధి అవకాశాల మధ్య మరింత లోతైన అనుసంధానంపైనే విద్య, నైపుణ్యాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సాంకేతికత మునుపెన్నడూ లేని వేగంతో పరిశ్రమలను మార్చేస్తున్న తరుణంలో మన విద్యాసంస్థలు విద్యార్థులకు కేవలం జ్ఞానాన్ని మాత్రమే కాకుండా, దానికి తగిన నైపుణ్యాలను, మారుతున్న పరిస్థితులకు అలవాటు పడే తత్వాన్ని, నిరంతరం నేర్చుకునే మానసిక స్థితిని అందించడం ఎంతో అవసరం. ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్ వంటి వేదికల ద్వారా అభివృద్ధి చెందుతున్న కొత్త రంగాల్లో మన యువతకు అవకాశాలను కల్పించే మార్గాలను మనం అందించాలి. దీని ద్వారా దేశ అభివృద్ధి ప్రస్థానంలో గొప్ప సహకారాన్ని అందించవచ్చు''

వరల్డ్ ఎకనామిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సాదియా జాహిదీ మాట్లాడుతూ.. "ప్రపంచ శ్రామిక శక్తి భవిష్యత్తును తీర్చిదిద్దే బలమైన స్థితిలో భారత్ ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే ఆర్థిక, సాంకేతిక మార్పులకు అనుగుణంగా నైపుణ్య వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యా రంగాల భాగస్వాముల మధ్య పటిష్టమైన సహకారం అవసరం. ఈ సమన్వయాన్ని పెంపొందించడానికి, పరిశ్రమల డిమాండుకు అనుగుణంగా శ్రామిక శక్తిని అభివృద్ధి చేయడానికి, మరింత సమ్మిళిత, స్థితిస్థాపక, భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సహాయపడటానికి ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్ కీలక వేదికగా నిలుస్తుంది"

శ్రామిక శక్తి పరివర్తన, నైపుణ్యాలకు నిధుల సమకూర్పు, అభివృద్ధి చెందుతున్న సరికొత్త సాంకేతికతలు, సమ్మిళిత వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఒక వ్యవస్థీకృత ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా ప్రాధాన్యతా చర్యలను ముందుకు తీసుకెళ్తామని వాటాదారులందరూ ఉమ్మడి నిబద్ధతను ప్రకటించడంతో ఈ రౌండ్‌టేబుల్ సమావేశం ముగిసింది. ఈ చర్చల ఫలితాలు ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్ కార్యాచరణ అమలుకు దిశానిర్దేశం చేయడమే కాకుండా, ప్రపంచ అగ్రగామి నైపుణ్యాల కేంద్రంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అండగా నిలుస్తాయి.

ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, అంతర్జాతీయ సంస్థలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పారిశ్రామిక రంగం నుంచి అపోలో హాస్పిటల్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, మహీంద్రా గ్రూప్, ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో, రిలయన్స్ ఫౌండేషన్, రెన్యూ, ఐబీఎం , భారత్ సీట్స్ లిమిటెడ్, రిలయెన్స్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు పాల్గొన్నారు. వీరితో పాటు వరల్డ్ ఎకనామిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, ఫిక్కీ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్, ఐఐటీ ఢిల్లీ-ఎఫ్ఐటీటీ, ఏఐసీటీఈ, యూజీసీ, సీబీఎస్ఈ, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఎన్‌సీవీఈటీ, ఎన్ఎస్‌డీసీ, ఎంఎస్‌డీఈ ప్రతినిధులు, దేశ నైపుణ్య, శ్రామిక శక్తి రంగానికి చెందిన ఇతర కీలక భాగస్వాములు కూడా ఈ చర్చల్లో పాల్గొని తమ సూచనలను పంచుకున్నారు.

ఇండియా స్కిల్స్ యాక్సిలేటర్ గురించి

వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి చెందిన గ్లోబల్ యాక్సిలేటర్ నెట్ వర్క్ లో ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్ ఒక భాగం. దీనిని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. నైపుణ్యాల కొరతను అధిగమించడం, శ్రామిక శక్తిని సన్నద్ధం చేయడం, ఉపాధి రంగంలో దేశ ఆర్థిక వృద్ధి, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు భాగస్వాముల వినూత్న పరిష్కారాలను ప్రోత్సహించడం ఈ వేదిక ప్రధాన లక్ష్యం.

# కదిరి యువ వైద్యుడి అరుదైన ఘనత..

అమరావతి, జూన్ 2: వైద్య రంగంలో కదిరి పట్టణానికి చెందిన ప్రముఖ స్పైన్ అండ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అజహరుద్దీన్ గద్వాల్ అరుదైన ఘనత సాధించారు. ఎంఎస్ (ఆర్థోపెడిక్స్) విభాగంలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవి ద్యాలయం టాపర్‌గా నిలిచి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ఈ గౌరవాన్ని స్వీకరించారు.

కదిరి పట్టణానికి చెందిన రిటైర్డ్ జువాలజీ లెక్చరర్ గద్వాల్ నిజాముద్దీన్ కుమారుడైన డాక్టర్ అజహరుద్దీన్ చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచారు. కదిరిలోని శ్రీ శారదా విద్యానికేతన్‌లో పదో తరగతి, విజయవాడలోని శ్రీ చైతన్య విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం నంద్యాలలోని శాంతిరామ్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌ను ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

వైద్య విద్యపై ఉన్న ఆసక్తితో నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో ఎంఎస్ ఆర్థోపెడిక్స్ పూర్తి చేసి విశ్వవిద్యాలయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు.

పీజీ విద్య అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్‌గా సేవలందించిన డాక్టర్ అజహరుద్దీన్ నిరుపేద రోగులకు అంకితభావంతో వైద్యం అందించి మంచి పేరు సంపాదించారు. ఆయన సేవలను గుర్తించిన అధికారులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఉత్తమ సీనియర్ రెసిడెంట్' అవార్డుతో సత్కరించారు.

వెన్నెముక శస్త్రచికిత్సల్లో మరింత నైపుణ్యం సాధించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లికా స్పైన్ సెంటర్‌లో స్పైన్ సర్జరీ ఫెలోషిప్ పూర్తి చేశారు. ఫెలోషిప్ సమయంలో పూణేలో జరిగిన జాతీయ స్థాయి అసికాన్ సదస్సులో పాల్గొని తన వైద్య నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సదస్సులో ఆయన సమర్పించిన వీడియో ప్రజెంటేషన్‌కు 'బెస్ట్ వీడియో ప్రజెంటేషన్' అవార్డు లభించడం విశేషం.

ప్రస్తుతం అనంతపురంలో సేవలందిస్తున్న డాక్టర్ అజహరుద్దీన్, కార్పొరేట్ ఆసుపత్రులకు మాత్రమే పరిమితమైన ఆధునిక వెన్నెముక, ఎముకల వైద్య సేవలను రాయలసీమ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు. సంక్లిష్ట ప్రమాద గాయాలు, ట్రామా కేసులు, డిస్క్ సమస్యలు, మెడ, నడుము నొప్పులు, మోకాళ్ల వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందిస్తూ రోగుల విశ్వాసాన్ని పొందుతున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ అజహరుద్దీన్ మాట్లాడుతూ, తాను సాధించిన ఈ విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వమే కారణమని తెలిపారు.

సాధారణ కుటుంబం నుంచి వచ్చి రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో అనంతపురం జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

రాష్ట్ర స్థాయి స్వర్ణ పతకం అందుకున్న డాక్టర్ అజహరుద్దీన్ గద్వాల్‌ను కదిరి, అనంతపురం జిల్లాలకు చెందిన వైద్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, స్థానికులు అభినందిస్తూ ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# భక్తుల భద్రత కోసమే దుకాణాల తొలగింపు

## -దుకాణాలు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం
## -అర్హులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై చర్యలు
## -ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల నివారణే లక్ష్యం: కలెక్టర్



తిరుపతి, జూన్ 2: అలిపిరి ప్రాంతంలో భక్తుల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక దుకాణాలను తొలగించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన వారికి సాధ్యమైనంత మేర న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో అలిపిరి ప్రాంతంలో తాత్కాలిక దుకాణాలు తొలగించడంతో ఉపాధి కోల్పోయిన దుకాణదారులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తున్నారని తెలిపారు. తిరుమలకు ప్రధాన ప్రవేశ ద్వారమైన అలిపిరి ప్రాంతంలో భక్తుల రద్దీ ఎల్లప్పుడూ అధికంగా ఉంటుందని పేర్కొన్నారు.

రాకపోకలకు అంతరాయం..

రహదారి పక్కన పెద్ద సంఖ్యలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడంతో భక్తుల రాకపోకలకు, వాహనాల సంచారానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తుల కోసం ఏర్పాటు చేసిన లగేజీ కౌంటర్ కారణంగా కూడా ఈ ప్రాంతంలో రద్దీ మరింత పెరుగుతోందన్నారు. అలిపిరి పరిసర ప్రాంతాలు భారతీయ విద్యాభవన్, సైన్స్ సెంటర్, వేదిక్ యూనివర్సిటీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్‌సీసీ అకాడమీ, అరవింద్ కంటి ఆసుపత్రి, టాటా క్యాన్సర్ ఆసుపత్రి, జూపార్క్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గంగా ఉండటంతో వాహనాల రాకపోకలు అధికంగా సాగుతున్నాయని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ రద్దీతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

వన్యప్రాణుల సంచారం..

అలిపిరి పరిసర ప్రాంతాలు అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండటంతో వన్యప్రాణుల సంచారం పెరిగిందని, ఇటీవల చిరుతపులులు ఎస్‌వీ యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో కనిపించడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. భక్తులు, వాహనదారులు, స్థానిక ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా చర్చించి తాత్కాలిక దుకాణాలను తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. అయితే, దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన వారిలో అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుందని తెలిపారు. బాధితుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, సాధ్యమైనంత మేరకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం..

## -ఊడిపోయిన రన్నింగ్ ట్రైన్ బోగీలు

అమరావతి, జూన్ 2:అనంతపురం జిల్లా గుత్తి రైల్వేస్టేషన్ పరిధిలో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. కర్ణాటక నుంచి బిహార్ వెళ్తుండగా ప్రమాదం చోటు



చేసుకుంది. రైలు వేగంగా వెళుతున్న సమయంలో అకస్మాత్తుగా 'జాయింట్ కప్లింగ్' ఊడిపోవడంతో.. ఇంజన్‌తో పాటు వెళుతున్న రైలు నుంచి ఎస్-6, ఎస్-7 బోగీలు విడిపోయి వెనుక ఉండిపోయాయి.

బోగీలు విడిపోవడాన్ని గమనించిన లోకో పైలట్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, తక్షణమే ఎమర్జెన్సీ బ్రేకులు వేసి రైలును నిలిపివేశారు. దీంతో వందలాది మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పైలట్ అప్రమత్తతతో ఒక పెద్ద రైలు ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. సమాచారం అందుకున్న రైల్వే సాంకేతిక సిబ్బంది యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగి, ఊడిపోయిన కప్లింగ్‌కు మరమ్మతులు చేశారు. బోగీలను తిరిగి విజయవంతంగా అనుసంధానించిన అనంతరం, రైలు కొంత ఆలస్యంగా గుత్తి స్టేషన్ నుంచి తన గమ్యస్థానానికి బయలుదేరి వెళ్లింది.

# పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 12,260 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జాతీయ రహదారుల ప్రాజెక్టుల నాణ్యత, నిర్వహణను సమీక్షించిన కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 2:కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో, మీడియా, సోషల్ మీడియా ద్వారా అందిన సమాచారం ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లోని 8,512 కిలోమీటర్ల, పశ్చిమ బెంగాల్‌లోని 3,748 కిలోమీటర్ల జాతీయ రహదారి ప్రాజెక్టుల నాణ్యత, నిర్వహణ ప్రగతిని సమీక్షించారు.

ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్రాతో పాటు మోర్త్, ఎన్హెచ్ఏఐ, ఎన్హెచ్ఐడీసీఎల్ ఉన్నతాధికారులు, ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పనుల అమలును వేగవంతం చేయాల్సిన అవసరాన్ని ఈ సమీక్ష సందర్భంగా శ్రీ గడ్కరీ ప్రముఖంగా పేర్కొన్నారు. రహదారుల మన్నికను పెంచడానికి, ప్రయాణ నాణ్యతను మెరుగుపరచడానికి, అంతరాయం లేని అనుసంధానానికి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని, ఆధునిక నిర్మాణ పద్ధతులను అవలంబించాలని ఆయన సూచించారు. కనెక్టివిటీని, ఆర్థిక వృద్ధిని, ప్రయాణికుల సౌకర్యాన్ని పెంపొందించేలా స్థిరమైన, సమర్థవంతమైన జాతీయ రహదారులను అభివృద్ధి చేయడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కూడా ఆయన స్పష్టం చేశారు.

వర్షాకాలంలో తలెత్తే అంతరాయాలను కనిష్ట స్థాయికి తగ్గించడానికి, ప్రయాణికుల భద్రతకు అధికారులు సమగ్రమైన ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగా సమర్థవంతమైన డ్రైనేజీ నిర్వహణ, రోడ్డు పక్కన వాలు ప్రదేశాల రక్షణ పనులు, తక్షణ స్పందన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

జాతీయ రహదారుల నాణ్యత, నిర్వహణకు సంబంధించిన కీలకమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో ఆర్ఈ వాల్స్, భద్రతా తనిఖీలు, రోడ్డుపై దారుల సంకేతాలు, మొక్కల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, ప్రీకాస్ట్ నిర్మాణాలు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల లోపాలను సరిదిద్దడం, ఎక్స్‌పాన్షన్ జాయింట్లు, లాజికల్ ప్రాజెక్ట్ టెర్మినీ, నిర్మాణ సామగ్రి ప్రమాణాల పాటింపు వంటి అంశాలు ఉన్నాయి.

సరిదిద్దే చర్యలను సకాలంలో అమలు చేయాలని, నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని శ్రీ గడ్కరీ సంబంధిత భాగస్వాములందరినీ ఆదేశించారు.

# మైనార్టీల సంక్షేమానికి సర్కార్ కృషి

## -జగిత్యాలలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు
## -రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్

జగిత్యాల, జూన్ 2: మతాల పేరుతో రాజకీయాలు చేస్తే అభివృద్ధి శూన్యమని, తాను మత రాజకీయాలకు దూరంగా ఉంటానని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. జగిత్యాలలో మంత్రి అజారుద్దీన్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ 1969 నుండి మొదలుకొని అనేక ఉద్యమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్ర ప్రజలు స్వరాష్ట్రాన్ని 2014లో సాధించుకున్నారన్నారు. క్రికెటర్గా తన కెరియర్ ప్రారంభించి ప్రస్తుతం రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు.

మతాల పేరుతో కొందరు రాజకీయాలు చేస్తున్నారని మంత్రి అజారుద్దీన్ అన్నారు. గత రాజకీయాలకు తాను దూరంగా ఉంటానని టీం వర్క్ చేస్తేనే ఫలితాలు వస్తాయని అజారుద్దీన్ తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు రైసింగ్ తెలంగాణ పేరుతో ముందుకు సాగుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు తీసుకు వస్తున్నారని మంత్రి అన్నారు. విద్యా ద్వారానే సమాజంలో మార్పులు వస్తాయని ఎందుకు అనుగుణంగా విద్య వ్యవస్థలో ముఖ్యమంత్రి గారు సమూల మార్పులు తీసుకువచ్చారని మంత్రి అజారుద్దీన్ తెలిపారు. జగిత్యాల జిల్లాలో మైనార్టీ సమస్యలు ఉన్నాయన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మైనార్టీల సమస్యలపై ఒక సమావేశం ఏర్పాటు చేయాలని అజారుద్దీన్ స్థానిక నాయకులను కోరారు. జిల్లా కేంద్రంలో ఈద్గా,



ఖబరస్థాన్ ఏర్పాటుపై కలెక్టర్తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. విద్యార్థుల స్కాలర్ షిప్ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. జగిత్యాలలో మెడికల్ కాలేజ్ను చూస్తే సంతోషంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాల సమస్యని పరిష్కరిస్తాని పేర్కొన్నారు. నేను బ్యాటింగ్ ఎంత స్పీడ్గా చేస్తానో.. మంత్రిగా కూడా అలానే పని చేస్తానన్నారు. జగిత్యాలలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే క్రీడాకారులకు సైతం జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. జగిత్యాల జిల్లాలోని మైనార్టీ సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి మంత్రి అజారుద్దీన్ కృషి చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కోరారు. క్రీడకారునిగా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర ప్రజల సేవ చేయడానికి రాజకీయాల్లోకి రావడం చాలా సంతోషమన్నారు. క్రీడాకారులకు కులం, మతం ఉండదని తెలిపారు. అజారుద్దీన్ మంత్రిగా రాణించి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# ప్రపంచ ప్రతికూలతల్లోనూ 2026 మే నెలలో 145 మిలియన్ టన్నుల సరుకు రవాణాను సాధించిన భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, జూన్ 2:భారతీయ రైల్వే 2025 మే నెలతో పోలిస్తే 1.3 శాతం పెరుగుదలను నమోదు చేస్తూ... 2026 మే నెలలో 145 మిలియన్ టన్నుల సరుకు రవాణాతో తన వృద్ధి వేగాన్ని కొనసాగించింది. ఇనుప ఖనిజం, ఉక్కు, ఎరువులు, ఇతర సరుకుల రవాణాల్లో అద్భుత పనితీరు ఈ వృద్ధికి దోహదపడింది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితి, లాజిస్టిక్స్-సరుకు రవాణా వ్యవస్థలపై దాని పరోక్ష ప్రభావం వల్ల తలెత్తిన సవాళ్లు ఉన్నప్పటికీ... సరుకు రవాణాలో గణనీయ వృద్ధి నమోదైంది. నిరంతర కార్యాచరణ పర్యవేక్షణ, ఆస్తుల సమర్థ వినియోగం ద్వారా దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల రవాణాకు అంతరాయం కలగకుండా చూడటంపై భారతీయ రైల్వే దృష్టి సారించింది.

గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ప్రధాన సరుకుల్లో... మిగిలిన ఇతర వస్తువులూ 16 శాతం బలమైన వృద్ధిని నమోదు చేశాయి. ఇనుప ఖనిజం లోడింగ్ 4.8 శాతం... పిగ్ ఐరన్, ఫినిష్డ్ స్టీల్ లోడింగ్ 3.5 శాతం పెరిగాయి. ఎరువుల లోడింగ్ 6.2 శాతంతో ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేసింది. ఇది ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలకు మద్దతునివ్వడంలో రైల్వేల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

రైల్వే సరుకు రవాణాలో అతిపెద్ద వాటాను కలిగి ఉన్న బొగ్గు లోడింగ్... గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు 1 శాతం పెరిగి స్థిరమైన వృద్ధిని కొనసాగించింది. థర్మల్ విద్యుత్ ప్లాంట్ల అవసరాలను తీర్చడానికి, ఇంధన భద్రతను నిర్ధారించడానికి, భారతీయ రైల్వే బొగ్గు రవాణాకు ప్రాధాన్యతనిచ్చి, నెట్‌వర్క్ అంతటా దాని రవాణాను నిశితంగా పర్యవేక్షించింది.

ప్రాంతాల వ్యాప్తంగా సజావైన సరుకు రవాణాను సులభతరం చేయడానికి, ఆర్థిక కార్యకలాపాలకు మద్దతునివ్వడం కోసం భారతీయ రైల్వే దేశీయ, ఎగుమతి-దిగుమతి కంటైనర్ ట్రాఫిక్ రెండింటిపైనా పర్యవేక్షణను ముమ్మరం చేసింది. ఈ చర్యలు క్లిష్ట పరిస్థితుల్లోనూ సరుకు రవాణా వృద్ధిని నిలబెట్టడానికి, సరుకు రవాణా వ్యవస్థ సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడ్డాయి.

గత ఏడాది ఇదే కాలంలో సుమారు 59 కోట్ల మంది ప్రయాణికులను రవాణా చేసిన భారతీయ రైల్వే, 2026 మే నెలలో 61 కోట్లకు పైగా ప్రయాణికులను రవాణా చేసింది. ఈ వృద్ధికి ప్రధాన కారణం నాన్-సబర్బన్ విభాగమే. ఈ విభాగంలో ప్రయాణికుల సంఖ్య 28 కోట్ల నుంచి 30 కోట్లకు పెరగడంతో, ఇది 7.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశవ్యాప్తంగా స్వల్పదూర, సుదూర ప్రయాణాల కోసం ప్రజలు రైలు ప్రయాణానికి ఇస్తున్న ప్రాధాన్యం కొనసాగుతోందనడానికి ఇది నిదర్శనం.

సీజనల్‌గా పెరిగే ప్రయాణ డిమాండ్‌ను తీర్చడం కోసం భారతీయ రైల్వే వివిధ మార్గాల్లో పెద్ద సంఖ్యలో వేసవి ప్రత్యేక రైళ్లను నడిపింది. ఆధునిక రైలు సేవలను నిరంతరం విస్తరించడం ద్వారా ప్రయాణికుల సౌకర్యం మెరుగైంది. ఈ జాతీయ రవాణా సంస్థ ప్రస్తుతం 164 వందే భారత్ సర్వీసులనూ నడుపుతోంది. వీటిలో హౌరా-కామాఖ్య మధ్య ఇటీవల ప్రవేశపెట్టిన స్లీపర్ వందే భారత్ సర్వీసు కూడా ఉంది. 2026 మే నెలలో మూడు కొత్త సర్వీసులను ప్రారంభించడంతో అమృత్ భారత్ సర్వీసుల సంఖ్య 68కి చేరుకుంది.

సరుకు రవాణాలో నిరంతర వృద్ధి, కీలక వస్తు విభాగాల్లో మెరుగైన పనితీరు, పెరుగుతున్న ప్రయాణికుల ఆదరణతో... భారతీయ రైల్వే దేశ రవాణా వ్యవస్థకు వెన్నెముకగా తన పాత్రను బలోపేతం చేసుకుంటూ, ఆర్థిక కార్యకలాపాలను సులభతరం చేస్తూ, దేశవ్యాప్తంగా ప్రజలను అనుసంధానిస్తూనే ఉంది.

# ఇసుక రవాణాకు కొత్త నిబంధనలు..

**-అతిక్రమిస్తే కఠిన చర్యలు**
**-చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్**

అమరావతి, జూన్ 2:మండలంలో మానేరు, చలి వాగుల నుండి ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక రవాణాకు కొత్త నిబంధనలు, ధరలను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గానికి మాత్రమే ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు ట్రాక్టర్ లలో సరైన పత్రాలతో ఇసుక రవాణా చేయాలన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ కూపన్లు, ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ నెంబర్, రిజిస్ట్రేషన్ పేపర్లు, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు నమోదు చేసుకోవాలన్నారు.

నియోజకవర్గంలోని మండలాలకు ప్రభుత్వం నిర్ణయించిన ట్రాక్టర్ ఇసుక తరలింపు, ధరల పట్టిక, ఎస్సై సతీష్ తెలిపారు. గోరి కొత్తపల్లి మండలంకు రూ 4000, రేగొండ, గణపురం, భూపాలపల్లి, మండలాలకు రూ 3500, చిట్యాల మండలంకు రూ 2200, టేకుమట్ల, మొగుళ్ల పల్లి, మండలాలకు రూ 2000, ప్రభుత్వంనిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు చేసిన, పత్రాలు లేకుండా రవాణా చేసిన ట్రాక్టర్లు సీజ్ చేసి, కఠిన కేసులు నమోదు చెయ్యనున్నట్లు ఎస్సై సతీష్ హెచ్చరించారు.

# ఈ నెల 11,12 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా 13వ బ్రిక్స్ పట్టణీకరణ సదస్సు నిర్వహించనున్న భారత్

న్యూఢిల్లీ, జూన్ 2:న్యూఢిల్లీ వేదికగా ఈ ఏడాది జూన్ 11-12 తేదీల్లో నిర్వహిస్తున్న 13వ బ్రిక్స్ పట్టణీకరణ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని కేంద్ర గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ ఈ రోజు ప్రీ-ఈవెంట్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత 'మానవత్వమే ప్రథమం'... 'సమర్థత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తాల మార్గదర్శకత్వంలో... 2026 బ్రిక్స్ అధ్యక్ష హోదాలో భారత్ నిర్వహిస్తున్న ఈ సదస్సు కీలకమైన మంత్రుల స్థాయి కార్యక్రమంగా జరుగుతుంది.

'ప్రజల కోసం నగరాలు: సమ్మిళిత, సమర్థ పట్టణాల భవిష్యత్తు కోసం బ్రిక్స్ సహకారం' ఇతివృత్తంతో పట్టణీకరణ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... నగరాల ప్రణాళిక, పరిపాలన, అభివృద్ధిలో ప్రజలకు ప్రాధాన్యమిచ్చే భారత్ విధానాన్ని ఈ ఇతివృత్తం ప్రతిబింబిస్తోందని అన్నారు.

**భారత్ వారసత్వం, కొనసాగుతున్న నాయకత్వం**

బ్రిక్స్ పట్టణీకరణ సదస్సును భారత్ తొలిసారిగా 2013లో న్యూఢిల్లీ వేదికగా నిర్వహించింది. తద్వారా బ్రిక్స్ సహకార అజెండాలో పట్టణీకరణను అధికారికంగా చేర్చింది. సుస్థిర పట్టణాభివృద్ధి, స్మార్ట్ నగరాలు, పట్టణ సమర్థతపై దృష్టి సారించిన భారత్ 2016లో విశాఖపట్నంలో ఈ సదస్సును మరోసారి నిర్వహించింది. మహమ్మారి అనంతరం ప్రపంచస్థాయిలో పట్టణ పునరుద్ధరణపై దృష్టి సారిస్తూ... 2021లో మరోసారి భారత్ ఈ సదస్సును వీడియో అనుసంధానం ద్వారా నిర్వహించింది.

ఇప్పుడు 2026లో జరగనున్న 13వ బ్రిక్స్ పట్టణీకరణ సదస్సుకు భారత్ నాలుగోసారి ఆతిథ్యమిస్తోంది. ఈ సదస్సు ప్రారంభమైనప్పటి నుంచి... బ్రిక్స్ దేశాలు పట్టణ విధాన అనుభవాన్ని పంచుకోవడానికి, ఉమ్మడి ప్రాధాన్యాలను గుర్తించడానికి, విస్తృత బ్రిక్స్ ప్రక్రియకు పట్టణాభివృద్ధి సంబంధిత సూచనలను అందించడానికి ఒక ప్రత్యేక మంత్రిత్వ స్థాయి వేదికగా పనిచేస్తోంది.

**బ్రిక్స్ దేశాల మధ్య ఉమ్మడి పట్టణ ప్రాధాన్యాలు**

గృహ నిర్మాణం, రవాణా, వాతావరణ మార్పుల ముప్పు, పురపాలన సామర్థ్యం, పట్టణ ఆర్థిక వ్యవస్థ, సేవల పంపిణీ వంటి ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొంటూనే అనేక బ్రిక్స్ దేశాలు వేగవంతమైన పట్టణ వృద్ధిని సాధిస్తున్న ఈ కీలక తరుణంలో బ్రిక్స్ పట్టణీకరణ సదస్సు జరుగుతోందని కేంద్ర మంత్రి అన్నారు.

ఈ సదస్సు సమ్మిళిత పట్టణాభివృద్ధి, వాతావరణ మార్పులను, విపత్తులను తట్టుకోగల మౌలిక సదుపాయాలు, పటిష్ఠ పురపాలక సంస్థలు, మెరుగైన పట్టణ పరిపాలన కోసం డిజిటల్ ఆవిష్కరణలు వంటి కొన్ని విస్తృత ప్రాధాన్యాలపై దృష్టి సారిస్తోంది.

**షెడ్యూల్ చేయబడిన కార్యక్రమం, ఆశించే ఫలితాలు**

రెండు రోజుల పాటు జరగనున్న 13వ బ్రిక్స్ పట్టణీకరణ సదస్సుకు బ్రిక్స్ సభ్య దేశాల నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు, విధాన రూపకర్తలు, పట్టణాభివృద్ధి రంగ నిపుణులు, నిపుణులూ హాజరుకానున్నారు. పదకొండు బ్రిక్స్ సభ్య దేశాలన్నింటినీ మంత్రుల స్థాయి ప్రతినిధి బృందాలతో ఈ సదస్సులో పాల్గొనడానికి ఆహ్వానించారు.సదస్సు మొదటి రోజున ప్రారంభ సమావేశం, ఉమ్మడి బ్రిక్స్ పట్టణ ప్రాధాన్యాలపై ఉన్నత స్థాయి ప్లీనరీ సమావేశం జరుగుతాయి. భారత పట్టణ పరివర్తనపై అవగాహన కల్పించడానికి గానూ ప్రతినిధులను న్యూఢిల్లీలోని ఎంపిక చేసిన పలు ప్రదేశాలకు క్షేత్ర పర్యటనకు తీసుకువెళతారు.సదస్సు రెండో రోజు ప్రాధాన్య రంగాల గురించిన నిర్దిష్ట అంశాలపై ప్యానెల్ చర్చలు జరుగుతాయి. సభ్య దేశాలు తమ దేశ అనుభవాలను పంచుకోవడానికి ఈ ప్యానెల్ చర్చల్లో పాల్గొంటాయి. దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలూ జరుగుతాయి.

# ఆసుపత్రులు, డిస్పెన్సరీలన్నింటా కేంద్రీకృత ఆన్‌లైన్ పేషెంట్ సమాచార వ్యవస్థను ప్రారంభించిన ఈఎస్ఐసీ

న్యూఢిల్లీ, జూన్ 2:సేవల్లో నాణ్యతను పెంచడానికీ, రోగుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ వారికి ఆరోగ్య సేవల అందజేతను నిర్ధారించే దిశగా ఒక ముఖ్య నిర్ణయాన్ని కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ అధీనంలోని కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) తీసుకుంది.. దేశమంతటా ఉన్న ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లోనూ, డిస్పెన్సరీల్లోనూ కేంద్రీకృత ఆన్‌లైన్ పేషెంట్ ఫీడ్‌బ్యాక్ సిస్టమ్ (రోగుల ప్రతిస్పందన వ్యవస్థ)ను విజయవంతంగా ప్రారంభించింది.

బీమా సదుపాయాన్ని కలిగివున్న వ్యక్తుల (ఐపీస్)తో పాటు లబ్ధిదారులు ఆరోగ్య సేవలకు సంబంధించిన తమ అనుభవాలను స్వయంగా పంచుకోవడం, నిర్దిష్ట ఆందోళనలేవైనా ఉంటే వాటిని వ్యక్తం చేయడం, సంస్థాగత మెరుగుదలను కోరుకుంటూ ఆచరణ రూపాన్ని ఇవ్వడానికి వీలున్న సూచనలనూ, సలహాలనూ తెలిపేటట్లు ఈ డిజిటల్ కార్యక్రమం చూస్తుంది. కీలక సేవలకు కొలమానాలను, ప్రత్యేకించి ఆసుపత్రి లేదా డిస్పెన్సరీలో స్వచ్ఛత, వైద్య సిబ్బంది నడవడిక తీరుతెన్నులు, అవసరమైన మందుల అందుబాటు అంశాలలో పౌరుల స్పందనను నేరుగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్లాట్‌ఫారాన్ని (వేదికను) రూపొందించారు.

ఉపయోగించుకొనే వారికి అనుకూలమైందిగా ఉండగల ఇంటర్‌ఫేస్‌లో భాగంగా రోగులు తమ మొబైల్ పరికరాలను వాడుతూ, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. తమ ఐపీ నంబరును నమోదు చేసి, తమకు కలిగిన అనుభవానికి రేటింగును ఇవ్వాలి. కొద్ది సెకన్ల లోపల తమ అభిప్రాయాన్ని తెలియజేయాల్సివుంటుంది.

**పారదర్శకత్వంతో పాటు జవాబుదారుతనానికి ఉద్దేశించిన పటిష్ట సాంకేతికత**

స్పందన యంత్రాంగ ప్రామాణికతను నిర్ధారించడం కోసం, సిస్టమ్‌లో ఓటీపీ చెల్లుబాటు ప్రక్రియను అనుసరించి ఐపీ వివరాలను వాస్తవ కాల ప్రాతిపదికన సరిచూడడానికీ, నకిలీ ప్రతిస్పందనలను అడ్డుకోవడానికీ ఖచ్చిత యంత్రాంగాలను జతపరిచారు. దీనికి అదనంగా, ప్రతిస్పందన ప్లాట్‌ఫారమ్.. భారత్‌లోని వివిధ కార్మికుల అవసరాలను ప్రభావవంతంగా నెరవేర్చడానికి విస్తృత స్థాయి సహాయాన్ని బహుళ భాషలలో అందజేస్తుంది.

**అంచెల వారీ పర్యవేక్షణతో పాటు ఫిర్యాదుల సత్వర పరిష్కారం**

రోగుల స్పందనను బట్టి తక్షణం పరిపాలన పరమైన చర్యలను చేపట్టడానికి సిస్టమ్‌లో బలమైన, పాత్ర-ఆధారిత డిజిటల్ డ్యాష్‌బోర్డుల ఏకీకరణకు చోటు కల్పించారు. దీనితో మూడు వేర్వేరు పరిపాలక అంచెలలో నిరంతరంగా, వాస్తవ కాల ప్రాతిపదికన పనితీరును పర్యవేక్షించేందుకు మార్గం సుగమం అవుతోంది.

ఈ సిస్టమ్‌ను ప్రత్యేకంగా రూపొందించడం అన్నింటి కన్నా ముఖ్యమైన అంశం. ఇది సేవల రేటింగు 3 కన్నా తక్కువకు పడిపోతే, ఆ విషయాన్ని తనంతట తాను పసిగట్టి, గంభీర సమస్యల్ని గుర్తిస్తుంది. ఈ ఆటోమేటిక్ అలర్ట్ యంత్రాంగం సంబంధిత అధికారులు సకాలంలో, లక్షించిన దిద్దుబాటు చర్యలను చేపట్టడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. దీనికి తోడు, ఈ ప్లాట్‌ఫారమ్ అన్ని ఆరోగ్యసంరక్షణ సదుపాయాల పనితీరు ర్యాంకింగునూ బలోపేతం చేస్తుంది. నిరంతర ప్రాతిపదికన మెరుగుదల, ఆరోగ్యవంతమైన పోటీతత్వం, ఖచ్చితమైన సంస్థాగత జవాబుదారీతనంతో కూడిన సంస్కృతిని ఇది ప్రోత్సహిస్తుంది.

దేశంలో కార్మికుల పట్ల ఈఎస్ఐసీ అంకిత భావానికి ఈ కార్యక్రమం ఒక నిదర్శనంగా నిలుస్తోంది. ఇది "మెరుగైన ఆరోగ్య సేవల్ని అందించడానికి ఈఎస్ఐసీ కట్టుబడి ఉంది" అనే మూల మంత్రాన్ని చాటిచెబుతోంది.

# జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

సంగారెడ్డి, జూన్ 2( నేటి నిజం ప్రతినిధి ) తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ సముదాయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు,ఆర్ డి ఓ,ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంచి ర్యాంకులు సాధించిన అభ్యర్థులు హాజరైన కోర్సులకు సంబంధించి కీలక సమాచారాన్ని దాచిన సంస్థ

న్యూఢిల్లీ, జూన్ 2:వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019ని ఉల్లంఘిస్తూ... కీలక సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా దాచి, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు పాల్పడిన వజీరామ్ అండ్ రవి ఐఏఎస్ స్టడీ సెంటర్ ఎల్ఎల్‌పీపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) రూ. 7,00,000 జరిమానా విధిస్తూ తుది ఉత్తర్వు జారీ చేసింది. ఒక వర్గంగా వినియోగదారుల హక్కులను పరిరక్షించి, ప్రోత్సహించడానికి... వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019లోని నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా వస్తువలు, సేవలకు సంబంధించి తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) ప్రధాన కమిషనర్ శ్రీమతి నిధి ఖరే, కమిషనర్ శ్రీ అనుపమ్ మిశ్రాల నేతృత్వంలో... 'వజీరామ్ అండ్ రవి ఐఏఎస్ స్టడీ సెంటర్ ఎల్ఎల్‌పీ' పై ఈ ఉత్తర్వును జారీ చేశారు. యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష (సీఎస్ఈ)-2023లో విజయం సాధించిన అభ్యర్థుల పేర్లు, ఛాయాచిత్రాలు, విజయాలను ఆ కోచింగ్ సంస్థ ప్రముఖంగా వాడుకుంటూనే, ఆ అభ్యర్థులు ఎంచుకున్న నిర్దిష్ట కోర్సులకు సంబంధించిన కీలక సమాచారాన్ని మాత్రం దాచిపెడుతూ అతిశయోక్తి ప్రకటనలు చేసిందని గుర్తించిన మీదట ఈ ఉత్తర్వును జారీ చేశారు.

యూపీఎస్‌సీ సీఎస్ఈ ప్రిలిమినరీ, మెయిన్స్ దశలు రెండింటినీ ఒక అభ్యర్థి సొంతంగా క్లియర్ చేసిన తర్వాత మాత్రమే ఐజీపీ ప్రోగ్రామ్ ప్రారంభమవుతుందని సీసీపీఏ పేర్కొంది. ఈ రెండు అత్యంత కఠినమైన పోటీ దశల్లో సంస్థ అందించిన విద్యాపరమైన సహకారం ఏమీలేదు. సమగ్రమైన, డబ్బు చెల్లించి చేయించుకునే కోచింగ్ ప్రోగ్రామ్‌ల ప్రకటనలతో పాటు... వారు ఎంచుకున్న నిర్దిష్ట కోర్సు గురించి ఎటువంటి సమాచారం వెల్లడించకుండా, అటువంటి అభ్యర్థులను ప్రముఖంగా ప్రదర్శిస్తూ, ఈ అభ్యర్థులు తమ పూర్తి-నిడివి కోచింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా వచ్చినవారేననే తప్పుడు అభిప్రాయాన్ని సంస్థ కల్పించింది.

విజయవంతమైన అభ్యర్థులు పూర్తి నిడివి గల తరగతి గది కార్యక్రమాలు, ఐచ్ఛిక సబ్జెక్ట్ కోచింగ్, టెస్ట్ సిరీస్ లేదా స్వల్పకాలిక ఉచిత ఇంటర్వ్యూ మార్గదర్శక కార్యక్రమాల్లో దేనికి హాజరయ్యారు అనే విషయాలు సహా... వారు ఎంచుకున్న నిర్దిష్ట కోర్సుల వివరాలను వెల్లడించకపోవడం చట్టం ప్రకారం తప్పుదోవ పట్టించే ప్రకటన కిందకు వస్తుందని సీసీపీఏ గమనించింది. ఇది భావి వినియోగదారులకు సమాచారంతో కూడిన ఎంపిక చేసుకునే సామర్థ్యాన్ని దూరం చేస్తుంది. ముఖ్యమైన సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడాన్ని నిషేధించే వినియోగదారుల రక్షణ చట్టం-2019లోని సెక్షన్ 2(28)(ఐ) కింద "తప్పుదోవ పట్టించే ప్రకటన" నిర్వచనం పరిధిలోకి వివాదాస్పద ప్రకటనలూ వస్తాయని సీసీపీఏ నిర్ధారించింది. ఈ ప్రవర్తన చట్టంలోని సెక్షన్ 2(9)ను కూడా ఉల్లంఘించినట్లు తేలింది. ఇది వినియోగదారులకు సమాచారం తెలుసుకునే హక్కును కల్పిస్తుంది.

విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడానికి, కోచింగ్ రంగంలో పారదర్శకతను నిర్ధారించడం కోసం తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అన్యాయమైన వ్యాపార పద్ధతులపై సీసీపీఏ ఇప్పటివరకు కోచింగ్ సంస్థలకు 60కి పైగా నోటీసులను జారీ చేసింది. యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష (సీఎస్ఈ), ఐఐటీ-జేఈఈ, ఎన్ఈఈటీ (నీట్), ఆర్‌బీఐ, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ అందించే సంస్థలపై సదరు ఉల్లంఘనల కోసం ఇప్పటివరకు సీసీపీఏ రూ. 1.46 కోట్లకు పైగా జరిమానాలను విధించింది.

# 38 విమానాశ్రయాలలో 10 కోట్ల వినియోగ మార్కును దాటిన డిజి యాత్ర యాప్ భారత డిజిటల్ విమానయాన విప్లవంలో కొత్త మలుపు

న్యూఢిల్లీ, జూన్ 2:భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)లో ఒక ప్రధాన మైలురాయిని నమోదు చేస్తూ, డిజి యాత్ర యాప్ ఐఓఎస్, ఆండ్రాయిడ్ వేదికల్లో 2.4 కోట్లకు పైగా డౌన్‌లోడ్‌లతో, 10 కోట్లకు పైగా సులభతరమైన ప్రయాణాలకు దోహదపడింది. నేడు ప్రపంచ విమానయాన రంగంలో అత్యంత విజయవంతమైన డిజిటల్ ఆవిష్కరణలలో ఒకటిగా ఈ ప్లాట్‌ఫారమ్ నిలుస్తోంది.

పత్రాల మాన్యువల్ వెరిఫికేషన్ స్థానంలో డిజి యాత్ర యాప్ రావడం వల్ల, విమానాశ్రయ ప్రవేశ ద్వారం వద్ద ఒక్కో ప్రయాణికుడి సగటు ప్రాసెసింగ్ సమయం 15 సెకన్ల నుంచి కేవలం 5 సెకన్లకు తగ్గింది. ఈ వేగవంతమైన ప్రయాణ ప్రక్రియ వల్ల టెర్మినల్ మౌలిక సదుపాయాల సామర్థ్యం గణనీయంగా మెరుగుపడింది. టెర్మినల్ వద్ద రద్దీ తగ్గింది. మాన్యువల్ ప్రాసెసింగ్ భారం కూడా కనిష్ట స్థాయికి చేరింది.

ఇంకా, భౌతిక (ఫిజికల్) బోర్డింగ్ పాస్‌ల అవసరాన్ని తొలగించడం ద్వారా, ఈ చొరవ భాగస్వామ్య విమానాశ్రయాలలో ప్రతిరోజూ వేలాది కాగితాలను ఆదా చేస్తూ పర్యావరణ సుస్థిరత్వానికి తోడ్పడుతోంది.

ఈ పురోగతిపై పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్ మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, "10 కోట్ల వినియోగ మైలురాయిని అధిగమించినందుకు డిజి యాత్ర యాప్ బృందానికి నా అభినందనలు. సులభతరమైన, కాగిత రహిత, స్పర్శ (కాంటాక్ట్) రహిత ప్రయాణంపై ప్రయాణికులలో పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనం. డిజి యాత్ర యాప్ వినియోగం ఈ స్థాయికి చేరడం ఒక కీలకమైన సమయంలో జరిగింది. 2014లో రోజువారీ సగటు దేశీయ ప్రయాణికుల సంఖ్య 2 లక్షల లోపు ఉండగా, గత మూడేళ్లలో అనేక సందర్భాల్లో అది 5 లక్షల మార్కును దాటింది. విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి, సౌకర్యవంతంగా మార్చాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా భారత విమానాశ్రయాలలో వార్షిక ప్రయాణికుల సంఖ్య 2030 నాటికి 50 కోట్లకు చేరుకుంటుందని, అలాగే 2040 నాటికి అది రెట్టింపు అయ్యి దాదాపు 100 కోట్లకు చేరుతుందని అంచనా. ఈ విశేష వృద్ధిని సమర్థవంతంగా నిర్వహించడానికి, మేము డిజి యాత్ర, సెల్ఫ్ బాగేజ్ డ్రాప్ ఫెసిలిటీ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆటోమేషన్ సిస్టమ్స్ పెంపుదల, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఎయిర్‌సేవా పోర్టల్, విమానాశ్రయ కార్యకలాపాలను మెరుగుపరచడానికి ఏఐ ఆధారిత డిజిటల్ ట్విన్స్ వంటి బహుళ డిజిటల్ పరిష్కారాలను అవలంబిస్తున్నాం" అని పేర్కొన్నారు.

భవిష్యత్తుపై తన ఆలోచనను పంచుకుంటూ శ్రీ రామ్ మోహన్ నాయుడు "అనేక దేశాలు బయోమెట్రిక్ ప్రయాణికుల ప్రాసెసింగ్‌ను పెద్ద ఎత్తున అమలు చేయడంపై ఇంకా అంచనాలు వేసుకుంటున్న తరుణంలో, భారత్ చాలా తక్కువ కాలంలోనే డిజి యాత్రను విజయవంతంగా ఆచరణలోకి తీసుకురావడమే కాకుండా దాని పరిధిని విస్తరించింది. ప్రస్తుతం డిజి యాత్ర 38 విమానాశ్రయాలలో అందుబాటులో ఉంది. వచ్చే ఏడాది నాటికి మరో 27 విమానాశ్రయాలలో ఇది ప్రారంభం కానుంది. ఈ ఏడాది కార్యకలాపాలు ప్రారంభించబోతున్న ప్రధాన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టులైన నవీ ముంబై, జేవార్, భోగాపురం పూర్తిగా డిజి యాత్ర సదుపాయంతోనే అందుబాటులోకి వస్తాయని పంచుకోవడానికి నేను సంతోషిస్తున్నాను" అన్నారు.

విమాన ప్రయాణ సౌలభ్యం పట్ల తన ఉద్దేశాన్ని వివరిస్తూ, "ఈ ప్లాట్‌ఫారమ్‌ను మేం మరింత సమ్మిళితంగా మారుస్తున్నాం. ప్రస్తుతం డిజి యాత్ర 11 భాషలలో ఉండగా, ఈ ఏడాది చివరి నాటికి మరో 11 ప్రాంతీయ భాషలను జోడించాలని యోచిస్తున్నాం. ఇది విమానయాన రంగాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే, సామాన్య మానవునికి విమాన ప్రయాణాన్ని అందుబాటులో ఉంచాలనే ప్రధానమంత్రి దార్శనికతను ముందుకు తీసుకెళ్తుంది" అని ఆయన అన్నారు.

డిజి యాత్ర ప్లాట్‌ఫారమ్ ప్రాథమిక నిర్మాణం 'ప్రైవసీ-బై-డిజైన్' విధానం ద్వారా భద్రతకు, ప్రయాణికుల వ్యక్తిగత గోప్యతకు కచ్చితమైన ప్రాధాన్యతనిస్తుంది. ప్రయాణికుల డేటా నిక్షిప్తమై వినియోగదారుడి స్వంత పరికరంలోనే సురక్షితంగా ఉంటుంది. దానిని తక్షణ ధృవీకరణ ప్రయోజనాల కోసం మాత్రమే ప్రయాణం ప్రారంభమయ్యే విమానాశ్రయంతో పరిమిత వ్యవధి మాత్రమే వినియోగిస్తారు.

భారత విమానాశ్రయాలకు ప్రయాణాన్ని అంతర్జాతీయ విమానయాన రంగానికి ప్రామాణికంగా మారుస్తూ, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ద్విముఖ దార్శనికత 'డిజిటల్ ఇండియా', 'అందరికీ విమానయానం' స్ఫూర్తితో, ప్రయాణికులకు విమాన ప్రయాణాన్ని మరింత సులభతరంగా, ఇబ్బందులు లేనిదిగా మార్చడానికి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

# 12 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం

**-ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం**
**-విశాఖ రైల్వే జోన్ సాకారం**
**-కేంద్ర మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు**
**-ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ఘనంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభోత్సవ కార్యక్రమం**
**-కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలోనే కల సాకారం కావడం గర్వకారణం**

అమరావతి, జూన్ 2: విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు కావడంతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన రైల్వే జోన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు భావోద్వేగంతో మాట్లాడుతూ, విశాఖ రైల్వే జోన్ సాధన కోసం గత 12 సంవత్సరాలుగా తాను సాగించిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. పార్లమెంట్‌లో అనేకసార్లు ఈ అంశాన్ని ప్రస్తావించానని, ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ప్రజాప్రతినిధిగా దీక్షలు కూడా చేపట్టానని తెలిపారు.అనాడు ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తిగా, నేడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలోనే ఆ కల సాకారం కావడం తన జీవితంలో మరపురాని ఘట్టమని అన్నారు. ఈ రోజు నుంచి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక పరిపాలన ప్రారంభమైందని వెల్లడించారు.

నూతన జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికంగానే త్వరితగతిన పరిష్కారాలు లభిస్తాయని, పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని చెప్పారు. తన తండ్రి కింజరాపు ఎర్రన్నాయుడు కూడా ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధన కోసం విశేష కృషి చేశారని గుర్తుచేశారు.

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, జిల్లా వ్యాప్తంగా రూ. 3,300 కోట్ల వ్యయంతో 50కి పైగా రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు మంజూరయ్యాయని తెలిపారు. ఇచ్ఛాపురం ప్రాంతానికి కూడా కీలకమైన ఆర్‌ఓబీ మంజూరు కావడం సంతోషకరమని పేర్కొన్నారు.దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇచ్ఛాపురం వంతెన సమస్యకు కూటమి ప్రభుత్వ హయాంలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధి, ప్రజల రవాణా సౌకర్యాల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

పూరి-అహ్మదాబాద్ రైలు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరిన మంత్రి, భవిష్యత్తులో ఆ రైలు సేవలు నేరుగా ఇచ్ఛాపురం నుంచే ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

**రూ. 400 కోట్లతో ప్రధాన కార్యాలయం**

విశాఖపట్నంలో 54 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 400 కోట్ల వ్యయంతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

# అనితర సాధ్యాలు...సంగం లక్ష్మీబాయి సేవలు

తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలను ముందుండి నడిపించిన ధీర వనిత ఆమె. బాలికల, స్త్రీల సంక్షేమం కోసం నిరంతరం తపించి, జీవితాంతం చిత్త శుద్ధితో పాటుపడిన సేవా నిరతికి ప్రతిరూపం ఆమె. స్వాతంత్ర్య సమర యోధురా లుగా తామ్రపత్ర గ్రహీత ఆమె. శాసన సభ్యురాలిగా, విద్యా మంత్రిణిగా, ఆంధ్రప్రదేశ్ సామాజిక, సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిణిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాధ్య రాలిగా సమర్థ వంతంగా పనిచేసి, ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె. ఆమే ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళగా గుర్తింపు పొందిన సంగం లక్ష్మీబాయి.

సంగం లక్ష్మీబాయి(జూలై 27, 1911 – జూన్ 3, 1979) 1911, జూలై 27 న ఘటకేసర్ సమీపంలోని ఒక కుగ్రామంలో జన్మిం చారు. బాల్యం లోనే తల్లి దండ్రులు, చిన్నతనం లోనే వివాహమై భర్త చనిపోవడంతో ఆమె అనాథ అయ్యారు. చాలా చురుకైన బాలిక కావడంతో మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం లభ్య మైంది. కార్వే విశ్వ విద్యాల యం, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ ప్రారంభించిన శారదా నికేతన్, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో చదువు కున్నారు. అక్కడ ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరు కున్నారు. నారాయణ గూడలో ఉన్న రాజా బహదూర్ వెంకట్రామి రెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసు కుంటూనే మరోవైపు స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు.

ఆమె సాంఘిక సేవలోనే పూర్తి సమయం వెచ్చించి ఆ తర్వాత రాజకీయాలలో చేరారు. ఆమె విద్యార్థిగా ఉన్న రోజులలో సైమన్ కమీషన్ ను వ్యతిరే కించారు. ఉప్పు సత్యాగ్రహం (1930–31) లో క్రియాశీలంగా పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు.

స్వామి రామానందతీర్థ ఆధ్వర్యంలో సాగిన నిజాం వ్యతిరేక ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించారు. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొని అరెస్ట్ అయి రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. ఆమె వినోభా భావే యొక్క తొలి పాద యాత్రకు తెలంగాణ లో సారథ్యం వహించారు. 1950లో భూదానోద్యమ యాత్ర కోసం తెలంగాణకు వచ్చిన ఆచార్య వినోబా బావే ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. ఆయన సందేశాన్ని ప్రజల్లోకి తీసు కెళ్లడంతో పాటు 16 గ్రామాలు తిరిగి 314 ఎకరాల భూమిని సేకరించారు. 1947–48లో తెలంగాణ విమోచనోద్యమం లోనూ పాల్గొన్నారు. విమోచన అనంతరం సేవా కార్యక్ర మాలలో పాల్గొన్నారు.

జూన్ 3...సంగం లక్ష్మీబాయి వర్థంతి



ఆమె 1952 లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజక వర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావు కేబినెట్‌లో విద్యాశాఖ సహాయ మంత్రిగా 1954 నుంచి 1956 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హయాంలోనే తెలంగాణ జిల్లాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు ప్రారంభ మయ్యాయి. మంత్రిగా సంపాదన మొత్తాన్ని స్త్రీ సేవాసదన్‌కు ఉపయోగించారు.

1955లో దాన్ని తన సహచరు లైన కేవీ రంగారెడ్డి, ఎ.శ్యామలా దేవి, పి.లలితాదేవి, పాశం పాపయ్య, ఎం.భోజ్‌రెడ్డితో కలిసి ఇందిరా సేవా సదన్‌గా రిజిస్టర్ చేయించారు. తద్వారా అనాథ మహిళలు, శిశువులకు ఉచిత విద్యనందించారు.

సంతోష్ నగర్ చౌరస్తాలో ప్రస్తుతం ఐ.ఎస్.సదన్‌గా పిలవబడుతున్న ప్రాంతంలో ఆమెకు రెండెకరాల స్థలంలో ఇల్లుండేది. తమ సొంత ఇంటిలోనే అనాథ శరణాల యాన్ని ప్రారంభించారు. అదే కాకుండా రాధికా మెటర్నిటీ హోమ్, వసు శిశువిహార్, మాశెట్టి హనుమంతు గుప్తా బాలికల ఉన్నత పాఠశాలల యొక్క స్థాపనలో ఆమె పాత్రలు మరిచి పోలేనివి.

లక్ష్మీబాయి సేవల గురించి తెలుసుకున్న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా వచ్చి సాయం చేశారు.

నాటి డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డితో పాటు ఇందిరా గాంధీ కూడా సేవా సదనం నిర్వహణకు తోడ్పాటు అందించారు.

1957లో మెదక్ నియోజక వర్గం నుండి 2వ లోకసభకు ఎన్నికయ్యారు. 1962 లో 3వ లోకసభకు ఎన్నికయ్యారు. మూడవ సారి 1967లో 4వ లోకసభకు వరుసగా మెదక్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు.

హైదరాబాదు యాదవ మహా జన సమాజం అధ్యక్షురాలిగా, అఖిల భారత విద్యార్థి సంఘం ఉపాధ్యక్షు రాలిగా, హైదరా బాదు ఫుడ్ కౌన్సిల్, ఆంధ్ర యువతి మండలి అధ్యక్షు రాలిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా బోర్డుకు కోశాధి కారిణిగా, హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగ కన్వీనరుగా ఉన్నారు.

ఆమె పద్దెనిమిదేళ్ల పాటు ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెసు కమిటీ బాధ్యురాలిగా కొన్నాళ్లు పని చేశారు.

స్వాతంత్ర్య సమర యోధురాలిగా గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెకు తామ్రపత్రం ఇచ్చి గౌరవించింది. 1979లో మరణించే వరకు లక్ష్మీబాయి స్త్రీలు, బాలికల సంక్షేమం కొరకు నిర్విరామ, అసమాన కృషి చేశారు.



–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# అల్ఫోర్స్ లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

కరీంనగర్, జూన్ 2:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఉ కాలేజెస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి అమరవీరుల మరియు తెలంగాణ తల్లి చిత్రపటం వద్ద చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఎంతోమంది అమరుల త్యాగ ఫలితమేని మరియు పలువురి పోరాటాల ద్వారా తెలంగాణ రాష్ట్రం 2014లో సాధ్యమైనదని మరియు మన దేశంలోని 29 రాష్ట్రంగా పరిగణించడం జరిగిందని వారు చెప్పారు. మన రాష్ట్రం మన వనరులతో మన అభివృద్ధిని సాధ్యం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణ వివక్షకు గురైనప్పటికీ పలు ప్రణాళికల ద్వారా అభివృద్ధి సాధించింది అని చెప్పారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలతో పాటు మరియు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధిని శరవేగంగా సాధిస్తున్నామని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి స్ఫూర్తి అయిన కాలోజి నారాయణరావు , దాశరధి , సురవరం ప్రతాపరెడ్డి , చాకలి ఐలమ్మ , కొమరం భీమ్ తదితరుల నుండి స్ఫూర్తిని తీసుకొని పోరాటపటిమను కొనసాగించి ఎటువంటి జాప్యం లేకుండా దీటుగా సమాధానాలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధింపచేసుకున్నామని మరియు కలను సహకారం చేసుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేకమైన ప్రణాళికలతో కార్యక్రమాలతో మనం అన్ని రంగాలలో రాణిస్తున్నామని హర్షం వ్యక్తం చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని




వారు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేకంగా ఉద్యమాల సమయంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల యొక్క పాత్ర చాలా మరువలేనిదని చెప్పారు. వేడుకలలో భాగంగా ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర గేయాలను ఆలపించి రాష్ట్రం పట్ల బాధ్యతను మరియు ఆప్యాయతను పెంపొందించారు. వేడుకలలో భాగంగా పలువురు ఉపాధ్యాయులు నృత్యాలు చేసి ఆలోచింప చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సంకేపల్లిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

## –జెండాలు ఆవిష్కరించిన మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి

రాజన్న సిరిసిల్ల, జూన్ 2:(నేటినిజం ప్రతినిధి): వేముల వాడ అర్బన్ మండలం సంకేపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీక్ష వల్లే 60 ఏళ్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కల సాకారమైందన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపారని కొనియాడారు. రైతుబంధు, ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి పథకాలతో తెలంగాణను సస్యశ్యామలం



చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమని ంచాలని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకో వడానికి ప్రతి ఒక్కరూ కదలిరా వాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు రెడ్డీవేణి పర్శరా ములు, ముత్త మహేష్, ఉప సర్పంచ్ పండుగ శంకర్, ఇర్నాల రాజు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, మచ్చ బుచ్చయ్య, గడ్డం నరేష్, హరికృష్ణ, మెరుగు శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, బాలరాజు, లక్ష్మణ్, సీనియర్ నాయకులు గుండెకార్ల నరేష్, నే రెళ్ల భాస్కర్, శ్రీనివాస్, ఇటిక్యాల సత్తయ్య, చోటు, పర్శరాములు, నాగరాజు, కనకరాజు, బండారి శ్రీనివాస్, మహేందర్, రాజశేఖర్, ఎల్లయ్య, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాంపల్లి పాఠశాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 2:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాంపల్లి పాఠశాలలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. వత్సల, 5వ వార్డు కౌన్సిలర్ వాసాల లావణ్య శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, రజిత, వినయ్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు దేశభక్తి, తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహించారు.

## పశ్చిమలో అట్టహాసంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదిన వేడుకలు..

అమరావతి, జూన్ 2: మాజీ కేంద్రమంత్రివర్యులు విజయవాడ పశ్చిమ శాసన సభ్యులు యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కూటమి నేతలు, అభిమానులు, తమ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు చేసి తమ అభిమా నాన్ని చాటుకున్నారు. మాజీ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఆధ్వర్యంలో కుమ్మరి పాలెం సెంటర్ లో ఎమ్మెల్యే సుజనా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు..

# రైతులకు ముందస్తు భరోసా!

**–విత్తనాలు, ఎరువులు సకాలంలో అందాలి**
**–నీటి విడుదల, యూరియా సరఫరాపై అధికారులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు**

శ్రీకాకుళం, జూన్ 2: రానున్న ఖరీఫ్ సీజన్‌కు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌తో కలిసి మంగళవారం ఖరీఫ్–2026–27 సన్నాహకాలు, కాలానుగుణ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ నాటికి రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. రైతులకు పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ప్రీ–మాన్సూన్ డ్రై సోయింగ్ లక్ష్యాల సాధనపై దృష్టి

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రీ–మాన్సూన్ డ్రై సోయింగ్ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ను ఆదేశించారు. యూరియా నిల్వలు, గత ఏడాది వినియోగం, ప్రస్తుత అవసరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, రైతులకు అవసరమైన ఎరువులను జూన్ నెల నుంచే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మండలాల వారీగా యూరియా అవసరాలను గుర్తించి వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు నివేదించాలని ఆదేశించారు. యూరియా పంపిణీకి వారం రోజుల ముందుగానే రైతులకు కూపన్లు జారీ చేయాలని చెప్పారు. వంశధార ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై కలెక్టర్ ఆరా తీయగా, జూలై రెండో వారంలో నీటిని విడుదల చేయనున్నట్లు వంశధార ఎస్ఈ తెలిపారు. ప్రస్తుతం గొట్టా బ్యారేజీలో 200 క్యూసెక్కుల నీరు నిల్వ ఉందని వివరించారు. గొట్టా బ్యారేజి వద్ద జరుగ ుతున్న అప్రాన్ పనులను జూన్ 20 నాటికి పూర్తి చేసి, కాలువల చివరి ప్రాంతాల వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కాలువల్లో లీకేజీలు, గండ్లు ఉన్న ప్రాంతా లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు, జలవనరుల శాఖ ఇంజినీర్లు సంయుక్తంగా కాలువలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.

# మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 2:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల బలిదానాలు, పోరాటాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కొనియాడారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఖమ్మం గణేష్ వస్తాది కృష్ణ, దైత కుమార్, విద్యాసాగర్, కార్యాలయ సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు

# పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 2:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మధు ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం దగ్గర జెండా ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల ప్రజల చిరకాల వాంఛ తెలంగాణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని సోనియాగాంధీ వల్లనే తెలంగాణ ఇవ్వడం జరిగిందని వారన్నారు.. టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 10 సంవత్సరాలు తెలంగాణ ఉద్యమకారులను మోసం చేసిన పార్టీ టిఆర్ఎస్ పార్టీ అని తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలను రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వారికి అండగా ఉండి శ్రీకాంతాచారి తల్లికి కార్పొరేషన్ లో పదవి ఇవ్వడం కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఆదుకోవడం జరిగిందని వారు గుర్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపూ రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, కూరగాయల కొముురయ్య, కౌన్సిలర్ లు తోటరాజు, కొండ శేఖర్ అన్నారం శ్రీనివాస్, ఇప్పప్పుల అజయ్, రామతీర్థపు హరీష్, కో ఆప్షన్ సభ్యులు పీర్ మహమ్మద్ నాయకులు పులి రాంబాబు గౌడ్, ముప్పిడి శ్రీనివాస్ ముప్పిడి శ్రీధర్, దాడి మల్లేశం, జడల శ్రీనివాస్, కుతాడి రాజేశం, లింగంపల్లి కిరణ్, వరజి మల్లేశం తదితరులు ఉన్నారు..

# పనికి వెళ్లిన వ్యక్తి..మరుసటి రోజు మృతదేహంగా!

అమరావతి, జూన్ 2: మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన టింకరింగ్ కార్మికుడు షేక్ జాకీర్ హుస్సేన్ (46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, జాకీర్ హుస్సేన్ ఈ నెల 1వ తేదీ ఉదయం టింకరింగ్ పనుల నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ గాలింపు చర్యలు చేపట్టారు.

ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం వేలూరు గ్రామం నుంచి జాలాది వైపు వెళ్లే రహదారి పక్కన జాకీర్ హుస్సేన్ గాయాలతో మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.